కొత్తపల్లి

పిల్లల కథల పుస్తకం



64

కొత్తపల్లి పిల్లల కథల పుస్తకం-64

జనవరి 2014

మూలం: http://kottapalli.in/2014/01/welcome

ఏపని- ఎవరిది:

ప్రచురణ: కొత్తపల్లి ప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

నిర్వహణ: సత్య ఫౌండేషన్, చెన్నూరు.

ప్రధాన సంపాదకులు: నారాయణ

సహసంపాదకత్వం: మంజునాథ్

చిత్రాలు: వీరాంజనేయులు, అడవి రాముడు

సాంకేతిక సహకారం: ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం: మల్లికార్జున

గౌరవ సలహాదారు: సుబ్బరాజు

అక్షర కూర్పు: కొత్తపల్లి

అలంకరణ: యాక్తూ ఫైన్ ఆర్ట్స్ స్టుడియో, హైదరాబాదు. ఫోను: 04042206233

ముద్రణ: ముద్రికా ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ ఫోను: 08662579129

స్వాగతం!

కొత్తపల్లిలో పిల్లల రచనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పుస్తకంలో దాదాపు సగం కథలు పిల్లలు రాసినవి; మిగిలినవి పిల్లలకోసం పెద్దలు రాసినవి. బొమ్మలు వేసిన వాళ్ళు మటుకు యువకులు.

పిల్లలను కలవటం, వాళ్లతో తెలుగులో కథలు రాయించటం, బొమ్మలు వేయించటం, వాళ్ళు పంపిన కథల్ని, బొమ్మల్ని సరిదిద్ది మిగతా పిల్లలందరికీ నచ్చేట్లు పుస్తకాలుగా తయారు చేయటం, దానికోసం ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడటం, కథల్ని అందరూ ఉచితంగా చదువుకునేట్లు ఇంటర్నెట్‌లో పెట్టటంతోపాటు, కొన్ని ప్రతులు అచ్చు వేయటం మాకు ఇష్టం. అందరి మేలూ కోరి చేసే ఈ పనిలో మీరూ పాలుపంచుకోండి. పిల్లల కథల ప్రపంచానికి స్వాగతం!

వెలల పట్టిక:

	వ్యక్తులు	సంస్థలు
విడి ప్రతి వెల (పోస్టేజీ అదనం)	25 రూ.	30 రూ.
12 ప్రతులు (పోస్టేజితో సహా)	300 రూ.	350 రూ.

రానున్న 12 ప్రతులకోసం 300 రూ.లను మనిఆర్డరు/బ్యాంకు ట్రాన్సుఫరు ద్వారా చెల్లించండి. పుస్తకాలను పోస్టులో పంపుతాం,

మీ రచనలను పోస్టు/ఇమెయిలు రూపంలో పంపండి. బాగున్నవాటిని తప్పక ప్రచురిస్తాం!

బ్యాంకు ట్రాన్సుఫరు కోసం అక్కౌంటు వివరాలు:

Kottapalli Prachuranalu,
S.B. A/c No: 62320333310
SBH- Dharmavaram Branch,
ISFC code: SBHY0020902

కొత్తపల్లి ప్రచురణలు

1-127/A, యం ఆర్ వో ఆఫీసు దగ్గర,

చెన్నేకొత్తపల్లి- 515101

అనంతపురం జిల్లా

ఫోను: 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in

వెబ్‌సైటు: http://kottapalli.in



విషయసూచిక

తిరిగి వచ్చిన కోయిల

అనగా అనగా ఓ వసంతకాలంలో చిట్టి కోయిల ఒకటి కొత్తగా గొంతు విప్పింది.

కుహూః.. కుహూః... అని కూస్తూ పోయింది.

చుట్టు ప్రక్కల వాళ్లందరికీ దాని గొంతు చాలా నచ్చింది. మరీ కీచుగా కాకుండా, మరీ మందంగా కాకుండా, సరైన 'పంచమం'లో కూస్తూంటే ఆ సంగీతం ఎవరికి నచ్చదు మరి?! అందరికీ నచ్చింది. ఎవరికి వాళ్ళు, అందరూ రోజూ దాని కూత కోసం ఎదురు చూడటం మొదలు పెట్టారు. ఆసారి మామిడి చిగుర్లు, వేప పూతలు అన్నీ చాలా ఇడిగాయేమో, కోయిలగొంతుకు అన్నీ కలిసి వచ్చి, అది ఇంకా ఇంకా ఇంపుగా కూయటం మొదలు పెట్టింది.

రానురాను చుట్టుప్రక్కల వాళ్లంతా ఆ కోయిల కూతకు అలవాటు పడిపోయారు. పిల్లలకైతే ఇప్పుడు రోజూ దాని కూతతోటే మెలకువ! అందరూ దానిలాగానే 'కుహూః.. కుహూః..." అని కూయటం మొదలెట్టారు. వాళ్లని చూసి చిట్టికోయిల కూడా- వాళ్ళు తనకు తోడు వస్తున్నారనేమో, మరింత ఉత్సాహంతో పాడటం మొదలెట్టింది.

ఇట్లా కొన్నాళ్ళు గడిచేసరికి ఊళ్ళో లేత చిగుళ్ళు తగ్గిపోయాయి. చిగుళ్ళన్నీ ఆకులౌతాయి కదా, అందుకని చిట్టికోయిలకు కష్టం అయింది. మెల్లగా అది పాడటం తగ్గించింది. పిల్లలంతా దాన్ని ఉత్సాహపరచారు- వాళ్ళు అరిచినప్పుడు అదీ కూసింది; అయితే వాళ్ళు ఆపగానే అదీ ఆపేయటం మొదలు పెట్టిందిప్పుడు!

ఇట్లా కొన్నాళ్ళు గడిచేసరికి చిట్టికోయిల గొంతు మూగపోయింది. ఎటుపోయిందో గానీ, ఇక అది ఎవ్వరికీ కనబడటంకూడా మానేసింది.

పిల్లలు దాన్నితలచుకొని 'బలే కూసేది కదా!' అని చెప్పుకునేవాళ్ళు. పెద్దవాళ్ళు ఏదైనా మంచిపాట

విన్నప్పుడు 'మా ఊళ్ళో కోయిల కూడా బలే పాడేది!' అనుకుని నిట్టూర్చేవాళ్ళు.

అంతలో ఏమైందో తెలుసుగా, మళ్ళీ వసంత ఋతువు దగ్గరపడింది. వేపలు, మావులు చిగుళ్ళేసాయి. రకరకాల చెట్లు మొగ్గలు తొడిగాయి. వాతావరణం మారింది. మారిన ఆ వాతావరణంలోకి అనుకోకుండానే వచ్చి చేరుకున్నది కోయిల. ఇప్పుడది పెద్దదైంది. గట్టిపడింది. అయినా దాని స్వరం ఇంకా చక్కగానే ఉంది. మామిడి చెట్లో కొమ్మ మీద కూర్చుని అది ఓసారి'కుహూ:.." అన్నదో లేదో ఊళ్ళోని చిన్నోళ్ళంతా గంతులు వేస్తూ "కుహూ:..కుహూ:.."మన్నారు. పిట్టలన్నీ ఆశ్చర్యంగా చూసాయి. కొత్తగా పుట్టిన లేగలు చెవులు రిక్కించి 'ఎవరిదీ..?' అనుకున్నాయి. పిల్లల ఉత్సాహాన్ని చూసి పెద్దవాళ్ళంతా ముసి ముసిగా నవ్వారు.

'ఈసారి కోయిల ఎన్నాళ్ళుంటుందో..?' అన్నాడో తాత.

'దాని ఇష్టం. మనదేముంది?" అంది అమ్మ.

'మన కోయిల బలే పాడుతుంది కదే అమ్మా?!" అంటూనే చిట్టి "కుహూ:.."మంటూ బయటికి పరుగు తీసింది.

నాలుగు నెలల విరామం తర్వాత, ఇదిగో- మళ్ళీ ఈ అరవైనాలుగో పుస్తకంగా మీ ముందుకొస్తోంది కొత్తపల్లి. చిన్న చిన్న మార్పులతో, నిర్వహణ పరంగా ఇంకొంచెం కట్టుదిట్టంగా, కొంచెంగా ఎదిగిన బృందంతో వస్తున్న ఈ కొత్త కొత్తపల్లి మిమ్మల్ని గతంలోలానే అలరిస్తుందని ఆశ. ఎప్పటిలాగే మీరంతా కథలూ-కబుర్లూ అన్నీ మీకు తోచిన విధంగా రాసి పంపిస్తూండండి మరి! బాగున్నవాటిని అన్నిటినీ ప్రచురిద్దాం.

నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలతో,

కొత్తపల్లి బృందం



కేలండరు కథ

సేకరణ, స్వేచ్ఛానువాదం: "ఇల్లాలిముచ్చట్లు" సుధ

కొత్త సంవత్సరం వస్తోంది అంటే అందరికీ సరదాయే! కొత్త క్యాలండర్లు తెచ్చుకోవడం, రోజూ దినచర్య రాసుకునేందుకు డైరీలు సిద్ధం చేసుకోవడం అందరికీ ఇష్టమైన పనులు. అసలైతే కాలానికి తుది-మొదలు అంటూ లేవు. అయినా రాత్రి-పగలు, రోజులు, నెలలు, సంవత్సరాలు అంటూ ఆ కాలాన్ని రకరకాలుగా విభజించుకొని, మనం మన కార్యక్రమాల్ని జరుపుకుంటూ పోతుంటాం. మనిషి ఇలా ఒక నియమబద్ధమైన జీవితాన్ని గడిపేలా చేయడంలో క్యాలెండర్ పాత్ర చాలా పెద్దది, కదూ?

'క్యాలండర్' అంటే ఏమిటి?

ఉదయం-సాయంత్రం వేళల్లో సూర్యుడు కనిపించటం-మాయమవుతుండటం, ఇక రాత్రుళ్ళు చీకటి పడగానే చంద్రుడు-నక్షత్రాలు కనిపించడం, సూర్యోదయంతో అవి కనిపించకుండా పోవడం, కొంతకాలం వేడి, కొంతకాలం చలి, కొంతకాలం వర్షాలు- ఇలా ప్రకృతిలో చోటు చేసుకుంటున్న రకరకాల మార్పులలో క్రమాన్ని గమనించాడు మనిషి. ఈ మార్పుల క్రమాన్ని అర్థం చేసుకొని, దాన్ని అనుసరించటం మొదలు పెట్టాడు. ఆ మార్పులకు అనుగుణంగా జీవించడానికి

ప్రయత్నిస్తూ తన జీవన ప్రమాణాలను పెంచుకున్నాడు. దైనందిన వ్యవహారాలను సులభంగా చక్కదిద్దుకోవడానికి, సూర్య-చంద్రుల గమనాన్ని తెలుసుకోవడానికి, ఇలా రకరకాల కారణాలతో కాలాన్ని లెక్కించటం మొదలు పెట్టాడు. ఇలాంటి 'కాలగణన'ను సూచించేదే, క్యాలండర్.

లాటిన్ భాషలో క్యాలండే (Kalendae) అనే పదం నుంచి పుట్టింది, 'క్యాలెండర్' అనే మాట. కాలెండ్ అంటే 'నెలలో మొదటి రోజు' అని అర్థమట. కానీ ఇప్పుడు క్యాలండర్ అనేది రోజులు- వారాలు- నెలలు- సంవత్సరాలు- అన్నిటినీ చూపించే ఒక కాల సూచిక ఐపోయింది.

ఎన్ని రకాల క్యాలండర్లు?

వివిధ దేశాల్లో, వివిధ నాగరికతల్లో, వాళ్ళ వాళ్ళ జీవన విధానాన్ని అనుసరిస్తూ పలు రకాల క్యాలండర్లు అమలులోకి వచ్చాయి. గ్రెగోరియన్ క్యాలండర్, జర్మన్ క్యాలండర్, హిందూ క్యాలండర్, ఇస్లామిక్ క్యాలండర్, ఇరానియన్ క్యాలండర్, హిబ్రూ క్యాలండర్, బౌద్ధుల క్యాలండర్- ఇలా ఎన్నో రకాల క్యాలండర్లు ఉంటున్నాయి.



వీటన్నిటిలోనూ 'కాలాన్ని లెక్కించే పద్ధతులు ఏంటి' అని చూస్తే మటుకు, అవి ప్రధానంగా రెండు విధాలు: 'చాంద్రమానం', 'సౌరమానం'. చంద్రుడి గమనం ఆధారంగా లెక్కకట్టే కాలాన్ని చాంద్రమానం అనీ, సూర్యుడి గమనం ఆధారంగా లెక్కకట్టే కాలాన్ని సౌరమానం అనీ అంటారు.

అనేక ఇతర దేశాల్లో మాదిరిగానే మన దేశంలో కూడా ఈ రెండు రకాల క్యాలండర్లూ

అమలులో ఉన్నాయి. మన సంస్కృతి సంప్రదాయాలలో భాగంగా పండుగలు పబ్బాలు జరుపుకునేందుకు వాడే తెలుగు క్యాలెండరు చాంద్రమానపుది. ఇక మనందరికీ బాగా అలవాట్లైపోయి, ప్రామాణికంగా వాడబడుతున్న ఆంగ్ల క్యాలండర్ సౌరమానం ప్రకారం నడుస్తుంది.

గ్రిగోరియన్ క్యాలండర్

ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు మనం అందరం వాడే ఇంగ్లీషు క్యాలండర్ అసలు పేరు గ్రిగోరియన్ క్యాలండర్. ప్రపంచం అంతటా ఇది ప్రస్తుతం అమలులోఉన్నా, దీన్ని నెలకొల్పినవాళ్ళు మటుకు రోమన్లే.

ఒకప్పుడు రోమన్లు ఓ 'రోమన్ క్యాలండర్' ను అనుసరించేవాళ్ళు. ఆ క్యాలండర్ ప్రకారం సంవత్సరానికి పదినెలలు- మార్చి నుండి డిసెంబరు వరకు ఉండేవి. చలికాలం కాలానికి లెక్క ఉండేది కాదు. అది పూర్తవ్వగానే మళ్ళీ కొత్త సంవత్సరం ప్రారంభం అయ్యేది. అదంతా కూడా మరి, చాంద్రమానం ప్రకారం ఉండేది! చంద్రుడు కనిపించే పౌర్ణమి నుండి నెల ప్రారంభం అవుతుండేది. దాంతో అదంతా కొంచెం చాలా ఇబ్బందిగానే ఉండేది.



కొత్త క్యాలండరు

ప్రతి సంవత్సరం జనవరి ఒకటవ తేదీన కొత్త సంవత్సరం ప్రారంభం అయ్యే సంప్రదాయం క్రీ.పూ. 46 లో గానీ మొదలు కాలేదు. దీన్ని మొదట ప్రారంభించినవాడు రోమన్ చక్రవర్తి 'జూలియస్ సీజర్'. అందుకే ఆ కొత్త క్యాలండర్‌ని జూలియన్ క్యాలండర్ అని పిలవటంమొదలు పెట్టారు. అంతకు ముందున్న రోమన్ క్యాలండర్‌కు చాలా సవరణలు చేశాడు జూలియస్ సీజర్.

అయితే ఈయన తయారు చేసిన జూలియన్ క్యాలండర్‌కూ, నిజంగా సంభవిస్తున్న సూర్యుడి గమనానికీ ప్రతి సంవత్సరమూ 11 నిముషాల తేడా రాసాగింది. అలా కొన్ని వందల-వేల సంవత్సరాలు గడిచిపోయే సరికి, ఈ తేడా కాస్తా చాలా పెద్దదే అయిపోయింది. నిముషాల తేడా రోజుల తేడా అయి కూర్చున్నది. దానికి తోడు భూ పరిభ్రమణానికి మరో పావురోజు ఎక్కువ పడుతున్నదని తెలిసింది. అట్లా కూడా జూలియస్ సీజర్ గారి క్యాలండరు వెనక పడింది!

ఈ ఇబ్బందుల్ని సవరిస్తూ, 16 వ శతాబ్దపు 'గ్రెగోరీ' అనే పోప్‌గారు క్యాలండర్లో మరికొన్ని సవరణలు చేశారు. నాలుగు సంవత్సరాలకి ఒకసారి ఒక పూర్తిరోజును ఫిబ్రవరి నెలలో కలిపి, దాన్ని 'లీప్ సంవత్సరం' అన్నారు. క్రీ.శ.1600 ను మొదటి లీప్ సంవత్సరంగా ప్రకటించారు. అప్పటినుండి పన్నెండు నెలల ఈ క్యాలండరును ఆయన పేరిట, 'గ్రెగోరియన్ క్యాలండర్' అని పిలుస్తున్నారు. ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలు కాలాన్ని లెక్కించడానికి ప్రస్తుతం ఈ గ్రెగోరియన్ పద్ధతే వాడుతున్నారు.



నెలల పేర్లు ఎలా వచ్చాయి?

ఈ క్యాలండర్లో పన్నెండు నెలలు ఉన్నాయి కదా, వాటి పేర్లన్నీ మనకు తెలిసినవే- అయితే ఆయా నెలల పేర్ల వెనక ఉన్న కథా కమామీషు ఆసక్తికరంగా ఉంటుంది:

జనవరి నెలను సంవత్సరంలో మొదటి నెలగా 'జూలియస్ సీజర్' మార్చాడు. 'జేనస్' అనే గ్రీకు దేవుడి పేరు మీద జనవరి నెల పేరు వచ్చింది. గ్రీకు పురాణాల ప్రకారం జేనస్ దేవుడికి రెండు ముఖాలుంటాయి. రెండూ వేరు వేరు దిశలను చూస్తుంటాయి. ఒక స్థితి నుండి మరొక స్థితిలోకి మార్పు చెందే అన్ని

కాలాల్లోను ప్రజలు ఈ గ్రీకు దేవుడిని ఆరాధించేవాళ్ళు. యుద్ధ సమయం, వ్యవసాయం, పెళ్ళిళ్ళు- అన్నిటిలోనూ ఈ దేవుడు గతించిన కాలాన్నీ, రాబోయే కాలాన్నీ సూచిస్తూ ఉండేవాడన్నమాట. అందుకనే కొత్త సంవత్సరాన్ని ఈయన పేరుతో మొదలు పెట్టించాడు జూలియస్ సీజర్.

ఇక,ఫిబ్రవరి కథ కొంచెం పెద్దది. '**ఫిబ్రువాలియా**' అనే పదం లాటిన్ భాషలోది. దీని అర్థం 'శుద్ధి చేయటం'. రోమన్లు ఫిబ్రవరి పదిహేనవ తేదీని పరిశుద్ధి చేసుకునే పండుగగా 'ఫిబ్రువా' అని పిలిచేవాళ్ళు. ఫిబ్రువా పేరుమీదే ఈ నెలకి ఫిబ్రవరి అని పేరు వచ్చింది.

క్రీ.పూ 7 వ శతాబ్ది వరకు రోమన్ల క్యాలండర్లో పది నెలలే ఉండేవని చెప్పాను కదా, ఆ రోజుల్లో మార్చి నెలతోటే సంవత్సరం మొదలయ్యేది. చలికాలాన్ని లెక్కలోకి తీసుకునేవాళ్ళు కాదు. కానీ క్రీ.పూ 713 లో రోమన్ చక్రవర్తి 'న్యూమా పాంపిలస్ ' క్యాలండర్‌కి చివర్లో ఈ నెలను కలిపాడు. ఆ తర్వాత ఓ రెండు వందల యాభై సంవత్సరాలపాటు ఈ నెలకు 23 రోజులే ఉండేవి. అప్పుడు జూలియస్ సీజర్ దీనికి మరో నాలుగు రోజులు కలిపి 28 రోజులు చేశాడు. తర్వాతి కాలంలో పోప్ గ్రెగరీ నాలుగు సంవత్సరాలకు ఒక రోజును అదనంగా కలిపే సరికి, ఫిబ్రవరి నెలలో నాలుగు సంవత్సరాలకు ఒకసారి 29 రోజులు ఏర్పడ్డాయి.

ఇక గ్రీకు పురాణాల ప్రకారం **మార్స్** (మెర్సిడోనియస్) అనే దేవుడు యుద్ధాలకు అధి దేవత. ఆ దేవత పేరు మీద ఈ నెలకు 'మార్చ్' అని పేరు వచ్చింది. ఈ నెలలో మార్స్ ను పూజించి తిరిగి యుద్ధాలను మొదలు పెట్టుకునేవాళ్ళు. మొదట్లో, రోమన్ క్యాలండర్ ప్రకారం, సంవత్సరం ఈ నెలతోటే మొదలయ్యేది. కానీ జూలియస్ సీజర్ పుణ్యాన జనవరి నెల మొదటికి వచ్చి, ఇది మూడో నెల అయ్యింది.

తర్వాతి నెల ఏప్రియల్. లాటిన్ పదం '**ఏప్రిలిస్**' దీనికి ఆధారం. 'క్రియ' అనీ, 'తెరుచుకునేది' అని దీనికి రెండు అర్థాలు ఉండేవి. ఎన్నో పండుగలు, శుభకార్యాలు మొదలు పెట్టే

నెలగా ఏప్రిలిస్ నెల ఉండేది. 'ఏఫ్రొడైట్' అనే మరో దేవత పేరు మీద ఏప్రియల్ వచ్చిందని మరో కథనం కూడా ఉంది. అందానికి, ప్రేమకు అధిదేవత ఏఫ్రొడైట్. ఏప్రియల్ నెలలో వసంతకాల ఆగమనంతో ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది కదా, అందువల్ల ఈ నెలకు ఆమె పేరు పెట్టారని చెబుతారు. మొదట్లో ఈ నెలకి 29 రోజులే ఉండేవట. జూలియస్ సీజర్ దీనికి మరో రోజు కలిపి 30 రోజులు చేశాడు.

ఇక, ఫ్రెంచి-లాటిన్ పదాలైన 'మాయి', 'మెయ్యా' లు **మే** మాసపు మూలాలు అని చెబుతారు. ఇటలీలో వసంతకాలపు దేవత పేరు మెయ్యా. ఫానస్ అనే రాజుకి, వల్కాన్ అనే రాణికి పుట్టిన ఈమె చాలా గొప్పదట. మెయ్యా అంటే అర్థం కూడా అదే- 'చాలా గొప్పది' అని! మే నెల చాలా గొప్పదన్నమాట.

ఇక, '**జూనో**' అనే లాటిన్ పదం నుండి ఏర్పడింది జూన్. రోమన్ దేవతల్లో అతి ముఖ్యమైన దేవత ఈ జూనో. స్త్రీల సౌభాగ్యానికి, పెళ్ళికి అధిదేవత ఈవిడ. జూపిటర్ అనే దేవుడికి స్వయానా చెల్లెలు. ఈ నెలకి కూడా మొదట్లో 29 రోజులే ఉండేవట. జూలియస్ సీజర్ చేసిన మార్పుల వల్లనే దీనికి కూడా 30 రోజులు వచ్చాయి.

క్యాలెండర్లో ఇన్నిన్ని మార్పులు చేసిన జూలియస్ సీజర్, తను పుట్టిన నెలకి **జూలై** అని తన పేరు పెట్టుకున్నాడట. అంతకు ముందు ఈ నెలని 'క్వింటిలిస్' అనేవాళ్లట- 'ఐదవది' అని దాని అర్థం. మొదట్లో జులై నెల ఐదవదిగా ఉండేది కదా, అందుకని ఆ పేరు ఉండేదన్నమాట.

రోమన్ క్యాలండర్ ప్రకారం ఆగస్టు మాసపు అసలు పేరు సెక్స్టిలస్- "ఆరవది". ఆ రోజుల్లో ఇది సంవత్సరంలో ఆరో నెలగా ఉండేది. అయితే క్రీ.పూ 8 వ శతాబ్దిలో రోమ్ నగరాన్ని పాలించిన 'అగస్టస్' చక్రవర్తి ఈ నెల పేరును తన పేరు మీదుగా 'ఆగస్టు' అని మార్చాడట. అగస్టస్ వేరెవరో కాదు: జులై నెలకు తన పేరు పెట్టుకున్న జూలియస్ సీజర్‌కి మారు కొడుకే ఈయన. మొదట్లో ఈ నెలకి 30 రోజులే ఉండేవట. 'అయితే తన మారుతండ్రి నెల- జులై-కి 31 రోజులుంటే తన నెలకి తక్కువ

ఎందుకుండాలని, ఈయన ఫిబ్రవరిలోంచి ఒక రోజును తగ్గించి తన నెలకు కలుపుకున్నాడు' అని ఓ కథ ఉంది. :)

ఇక వచ్చి, సెప్టెంబర్ నెల. రోమన్ భాషలో 'సెప్టమ్' అంటే 'ఏడవది' అని అర్థం. నెలలు మార్చితో మొదలైనప్పుడు ఇది ఏడోదికదా, అందుకని ఆ పేరు. అయితే ఆ తర్వాత నెలలు జనవరితో మొదలైనా, దీని పేరు మటుకు మారకుండా అలానే ఉండిపోయిందట- 'సెప్టెంబర్' అని.

మరి 'ఆక్టో' అంటే ఎనిమిది. ఒకప్పటి ఎనిమిదో నెల 'అక్టోబరు' అయ్యింది. క్యాలెండర్లు మారే సరికి, ఇప్పుడు ఇది పదో నెల అయికూర్చున్నది. అయినా దాని పేరు మటుకు అలాగే ఉండిపోయింది.

ఇక, 'నవం' - తొమ్మిది నుండి 'నవంబరు'; 'డిసెం'-పది- నుండి డిసెంబరు వచ్చాయి. అప్పట్లో ఇవి తొమ్మిదవ, పదవ నెలలు కదా. ఇదన్నమాట క్యాలండరు కథ.

"మనందరం ఉపయోగించే క్యాలండర్ వెనక ఇంత కథ ఉందేం!?" అని ఆశ్చర్యం కలుగుతుంది కదూ, ఇదంతా చదివితే?!

ఒకప్పుడు మన దేశంలో గ్రంధాలయాల వ్యవస్థ చాలా బాగుండేది. ప్రతి బడిలోనూ ఒక గ్రంధాలయం ఉండేది, దానిలో పుస్తకాలు ఉండేవి! ఆ పుస్తకాలను చదువుకునేందుకు ప్రత్యేకించి వారానికి రెండు తరగతులు కూడా ఉండేవి. పుస్తకాలను పిల్లలు ఇంటికి కూడా తీసుకెళ్ళి, చదివి, వెనక్కి తెచ్చి ఇచ్చే వీలుండేది! అంతేకాక, ఊరూరా చిన్న గ్రంథాలయాలూ, జిల్లాకో కేంద్ర గ్రంధాలయం, ఇవన్నీ బాగా నడిచేవి.

అట్లా చాలా మంది పిల్లలకు ఖర్చు లేకుండా విజ్ఞాన వినోదాలను సంపాదించుకోటానికీ, పుస్తకాల పట్ల, భాషపట్ల ఇష్టం పెంపొందించుకోటానికీ అవకాశం లభించింది.

మనందరం తలచుకుంటే అలా చేయటం ఇప్పుడూ ఏమంత కష్టం కాదు.... తలచుకుందామా, మరి?!



నీతి చంద్రిక


విగ్రహం-21

జరిగిన కథ: కొంగలు జరిపిన మెరుపుదాడిలో నెమలి రాజు సైన్యం బాగా దెబ్బ తిన్నది. అప్పుడుగానీ నెమలి రాజుకు తన మంత్రి దీర్ఘదర్శి విలువ తెలిసి రాలేదు. చివరికి అది దీర్ఘదర్శికి క్షమాపణలు చెప్పుకొని, బ్రతిమాలి-బామాలి అతన్ని మళ్ళీ ప్రసన్నుడిని చేసుకున్నది. అప్పుడు దీర్ఘదర్శి ఇచ్చిన సలహా మేరకు శత్రువుల కోటను ముట్టడించడానికి సిద్ధపడింది నెమలి. ఇక చదవండి, నీతిచంద్రిక-45 వ భాగం.

చక్రవాక మంత్రి సర్వజ్ఞుడు హంసరాజుతో "ప్రభూ! ముందుగా మన వీరుల బలాబలాలను పరీక్షించాలి; ఎవరికి తగినట్లు వారిని సన్మానించాలి. దానివల్ల వాళ్లకు ఉత్సాహం కలుగుతుంది; ప్రాణాలను కూడా లెక్కించనంత ధైర్యం వస్తుంది. దానం కంటే కూడా సన్మానమే వెయ్యిరెట్లు ఎక్కువ ఫలాన్నిస్తుంది- సన్మానమే అన్ని విధాలుగా మేలు. సమర్థులైన సైనికులను వారి పనితీరుకు తగినట్లు సన్మానించటాన్ని మించిన పని రాజులకు మరేదీ లేదు" అన్నది.

వెంటనే మంత్రి మాటను అనుసరించి

హిరణ్యగర్భుడు తన సైనిక బృందాలను వెంటనే అక్కడికి పిలిపించి, బహుమతులు ఇచ్చి, బాగా ఉత్సాహపరచి, వాటినన్నిటినీ యుద్ధానికి ప్రేరేపించింది. అంతలోనే దూరంగా దుమ్మురేపుకుంటూ వస్తున్న శత్రుసైన్యం అందరికీ కనబడింది.




అప్పటివరకూ ఉరికే కూర్చున్న టక్కరి కాకి నీలవర్ణుడు సమయం మించిపోతున్నట్లు వచ్చి హిరణ్యగర్భుడి ముందు నిలబడి, "ప్రభూ! ఈ సేవకుడి పలుకులనూ కొంచెం దయతో వినండి. నా అభిప్రాయాన్ని పలచనగా చూడకండి. ఈ చిన్న విన్నపాన్ని వినండి- అదిగో, శత్రువు కయ్యం కోసం కాలు దువ్వుతూ మన కోట వాకిలి దగ్గరికి వస్తున్నాడు. అతడు మన కోటనుండి బయటికి పోయే దారిని ఎక్కి వచ్చాడంటే, మనం అందరం కాళ్ళు తెగినట్లు ఇక్కడే ఉండి పోయి, ఊరూ పేరూ లేని వాళ్ల మాదిరి చావాల్సి వస్తుంది.

ఈ సమయంలో నన్ను ఖాళీగా ఉంచకండి. 'పంపవచ్చు-పంపరాదు' అనే అనుమానాన్ని విడచి, నన్ను తమరి ఇష్టం వచ్చిన పనికి పంపండి. తమరి ఆజ్ఞ అయిందంటే నాకు ఎదురైన ఈ గోరువంకల గుంపును నేను అస్సలు లక్ష్యపెట్టకుండా ముందుకు దూసుకుపోతాను. ఇవేవో నేను కండకావరంతో మాట్లాడే పిచ్చి మాటలు అనుకోకండి. నేను యుద్ధంలో పోరాడే-టప్పుడు ఎదురువచ్చిన శత్రువులందరూ ఎట్లా చస్తారో; ఏవిధంగా చెల్లాచెదరై పారిపోతారో తమరు స్వయంగా చూడగలరు.

నా మాటను ఈ ఒక్కసారికీ మన్నించి చూడండి- వడ్డీతో సహా నా రుణాన్నంతా ఆ మొరటు శత్రువులచేత కక్కిస్తాను; ఆ

విధంగానైనా తమరి రుణం నుండి విముక్తుడినౌతాను- సరేనన్నట్లు కనీసం తమరి కనుబొమ్మను ఓమారు కదల్చండి- చాలు" అన్నది.



చక్రవాకమంత్రి సర్వజ్ఞుడు ఆ మాటలకు ముఖంలో నవ్వు కాని నవ్వును పులుముకొని, వెటకారంగా- "ఔనౌను. నువ్వు ఎంతకైనా సమర్థుడివే. ఊరికే శ్రమపడకు; ఇంతటితో చాలించుకో. 'ఏమి చేయచ్చు; ఏమి చెయ్యకూడదు' అనేది తెలీక ఊరికే మాటలు ప్రేలటమే తప్ప, నీకు బుద్ధి అణువంత కూడా ఉన్నట్లు లేదు. ఎప్పుడూ నువ్వు 'యుద్ధం-యుద్ధం' అనే కలవరిస్తూ వస్తున్నావు. ఇదిగో ఇవాల్టికి అది నిజమైంది. నువ్వే దీనికంతటికీ కారణం. నిష్కారణంగా ఈ వైరాన్ని పెంచుతూ వచ్చింది అసలు నువ్వే. దీనివల్ల మా అందరి మీదా ప్రళయం విరుచుకు పడుతుంది గానీ, నీ ఒక్కడితోటీ పోయేది కాదిది.

యుద్ధం అంటే ఏంటో తెలీనివాళ్ళు ఇంటి దగ్గర ఎన్నో బీరాలు పలుకుతారు కానీ, నిజంగానే గాలి అటు మళ్ళి పోరాడాల్సి వస్తే చూడాలి- వాళ్ల క్రింది దవడల కీళ్ళు పడిపోతై; ఇక నోట్లోంచి మాట పెగలదు. నేను చెప్పే మంచి మాటలను తక్కువగా చూడకు- నీ దుర్మార్గపు బుద్ధిని కట్టిపెట్టు. కొంచెం మంచివాడివవ్వు!" అని, రాజువైపుకు తిరిగి "ప్రభూ! ఈ మోసగాడి గొప్పలు అన్నీ నిజం అనుకొని, మన గౌరవాన్నీ, ప్రాణాలనూ కోల్పోవటం మంచిది కాదు. వీడికి బాగా క్రొవ్వెక్కి, నోటికి వచ్చినట్లల్లా కూస్తున్నాడు తప్పిస్తే, ఏ కొంచెం కూడా పనికి రాడు. జాగ్రత్తగా చూస్తే వీడు స్నేహితుడి వేషంలో చరిస్తున్న శత్రువు.

తమరు మంచితనానికి పోయి, ఈ మోసగాడి శుద్ధ దండగమారి సేవలను కూడా తియ్యతియ్యగా వర్ణిస్తుంటారు. ఈ దుర్మార్గుడి మాటలను కొంచెం కూడా చెవిన వేసుకోకూడదు. మన సైన్యం ఈ కోటను విడిచి బయటికి వెళ్లిందంటే, ఇక మనం అసలు కోటలోకి చేరిన ప్రయోజనమే నెరవేరదు- దీనికోసం మనం పడ్డ శ్రమ అంతా కూడా పూర్తిగా నిష్ప్రయోజనం అవుతుంది.



'నీళ్లలో ఉండి ఏనుగును కూడా పీనుగును చేయగల్గిన మొసలి, ఆ నీళ్ల బయట ఉన్నప్పుడు కుక్క పాటి కూడా చేయదు -అదంతా స్థానభ్రంశం వల్లనే కదా? కోట బయటికి వెళ్ళినట్లయితే యుద్ధంలో మన గువ్వలన్నీ గవ్వకు కూడా కొరగావు. ఈ నీలవర్ణుడు అనుకూల శత్రువు. వీడి మాటలు తమరి చెవులకు అమృత సమానాలుగా తోస్తున్నట్లున్నది- అందుకే తమ మతికి అవే సరయినవి అనిపిస్తున్నాయి. ఇంతకీ మనవాళ్లకు కాలం మూడినట్లున్నది; అందుకే మీ మనసులో ఈ మోసపు మాటలు వాటంగా నాటుకుంటున్నాయి.." అంటూ ఇంకా ఏదో చెప్పబోయిన మంత్రి మాటలకు అడ్డం వచ్చింది కాకి.

ఆ సరికి దానికి అర్థమైంది- 'హిరణ్యగర్భుడు తన మీద 'నమ్మకం' అనే ఉరిలో ఇప్పుడు పూర్తిగా చిక్కుకొని ఉన్నాడు' అని! అందుకని అది మనసులో సంతోషిస్తూ, సర్వజ్ఞుడిపై కోపంతో విరుచుకుపడింది:

హంసరాజుతో అన్నదది: "మహారాజా! నా మాటలను తక్కువ చేయక, తమరి దివ్య చిత్తంలో కొద్దిగా తావిచ్చి వినండి. ఈ సర్వజ్ఞుడు మేకవన్నె పులి. మనకు ఏమైనా సరే, తన ప్రాణాలను మాత్రం

కాపాడుకుందామని వీడి ఆశ- అందుకనే ఇప్పుడు ఇన్ని పోకడలు పోతున్నాడు. వీడు మన దగ్గర ఉంటే మన ఒళ్ళో పాము ఉన్నట్లే.



అసలు ఇతను యుద్ధానికి రాకపోవటమే మేలు. ఇతను ఒక్కడూ లేనంత మాత్రాన మనకేమీ కొరత రాదు. బాసికాలు దాచినంత మాత్రాన పెళ్ళి ఆగుతుందా? ప్రభువులవారి ముందు గొప్పలు చెప్పుకోకూడదు గాని, తమరికి గెలుపు సాధించి పెట్టేందుకు నేను ఒక్కడినీ చాలు. నా గొప్పతనాన్ని చూడలేక, లేని తక్కువ తనాన్ని నామీద మోపి, నన్ను తిడుతున్నాడు వీడు.

అయ్యో, వినేందుకు ఇది ఎంత రోతగా ఉన్నది! నిజంగా చూస్తే ఇవన్నీ నన్ను దగ్గరివాడుగా భావించి ఆదరిస్తున్న ప్రభువులవారిని అనటమే తప్ప, నన్ను అనటం అవుతుందా?! ఇతనివంటి సేవకులకు ఎట్లానో తెలీదుగాని, శరీరంలో పిరికి కండ లేని ధీరులకు ప్రాణాలకంటే అభిమానాలే ఎక్కువ. ఆత్మ గౌరవమే ప్రాణాలకంటే అధికం. అందువల్ల లోకంలో అభిమానవంతులు నీచపు పనులకు తల ఒగ్గరు. ప్రాణాలనైనా వదులుతాను గానీ, ఆత్మగౌరవాన్ని విడచిపెట్టి లోకంలో 'పిరికి పంద' అనే అపవాదును మోసుకోలేను.

కుండను మూసేందుకు మూకుళ్ళు కావాలంటే దొరుకుతాయి గానీ నోటిని మూసేందుకు మూకుళ్ళు ఎక్కడా దొరకవు. సమయం వచ్చినప్పుడు ప్రాణాలు కాపాడుకొని, ప్రళయ కాలం వరకూ ఈ గొప్పాయనే బ్రతుకుతాడేమో మరి, బ్రతకనివ్వండి!" అని, మోసపు నవ్వు ఒకటి నవ్వుతూ "ఆహాహా! వీడి మాటల్ని

నమ్మాలట! మన గువ్వలట, కోటను దాటి బయటికి వెళ్తే గవ్వకు కూడా కొరగావట! కొద్ది రోజుల క్రితమే అనంతమైన శత్రు సైన్యాల మీద పడి, ఊచకోత కోసి వచ్చిన మన సైన్యం ఇప్పుడు ఈ కొద్దిపాటి సైన్యానికి ఎదురొడ్డి నిలువవట! దీన్ని మించిన అపహాస్యం వేరే ఏముంటుంది? పనికిమాలిన ఈ అనుమానాలన్నిటినీ కట్టిపెట్టి, సైన్యంతో సహా బయటికి ఉరికి, ఇప్పటికే చచ్చి ఉన్న ఆ కొద్దిపాటి శత్రు మూకలనూ తుదముట్టించి వద్దాం" అంటూ శూలాల్లాంటి మరిన్ని పొడుపులతో ఆ చక్రవాకాన్ని పీడించి, హంసరాజుకు పొగరు ఎక్కించింది.

ఈ విధంగా నీలవర్ణుడితోబాటు విధి కూడా తనను ప్రేరేపించినట్లయి, "ఇది నీళ్ళలోని ముల్లు" అనీ, "ఇట్లా అనిశ్చితితో ఊరికే కాలాన్ని వృధా చెయ్యరాదు" అనీ కొంచెం సేపు ఊగిసలాడి కూడా, చివరికి ఆ హంసరాజు ఊరకే ఉండిపోయింది.

దాంతో నీలవర్ణుడికి కూడా హంసరాజునుండి పూర్తి అంగీకారం దొరకలేదు. అయినా అది ఆవేశాన్ని నటిస్తూ తన చేతికి అందినంత సైన్యాన్ని వెంట బెట్టుకొని కోట వెలుపలికి పరుగు పెట్టి, శత్రుసైన్యంతో తలపడింది.

ఇదంతా చూసి, అక్కడ చేరిన పక్షులన్నీ రహస్యంగా తమలో తాము గుసగుసలు పోవటం మొదలు పెట్టినై. చక్రవాక మంత్రి సేనాపతిని సమీపించి "నీలవర్ణుడితో స్నేహాన్ని మాన్పించటంకోసం మన రాజుతో నేను ఏమేం అనాలో అవన్నీ అనేశాను. నేను ఎంత చెప్పినా తన దారిని విడువక, మన రాజు "నేను పట్టిన పిట్టకు నాలుగు కాళ్ళు" అనే అంటున్నది. మన మీదికి నింద రాకుండా, చేతనైనంత వరకూ మనం నిలిపి చూశాం. ఇక మీద దేవుని చిత్తం ఎలా ఉంటే అలా జరగక మానదు. మనకి కాలం-కర్మం కలిసి రాకపోతే మన రాజుకు మంచి బుద్ధి ఎలా పుడుతుంది? మన రాజుకు క్రొత్తవాళ్లే తనవాళ్ళు. మనం అందరం పరాయి వాళ్లం!" అన్నది.

ఆ విధంగా మాట్లాడుకుంటూనే, దగ్గరగా వస్తున్న హంసరాజుని చూసి, కళ్లతోటే సైగలు చేసుకుంటూ, ఏదో యుద్ధోత్సాహంతో పని

చేస్తున్నట్లు నటించటం మొదలు పెట్టాయి పక్షులన్నీ.

అంతలోనే తెల్లని తన రెక్కల కదలికవల్ల పుట్టిన గాలి వేగానికి రేగిన దుమ్ము భూమిని, ఆకాశాన్ని కప్పివేస్తుండగా గొప్ప కోపంతో, ఆవేశంతో ఒళ్ళు తెలీనట్లు యుద్ధం చేసేందుకు పరుగున వచ్చింది హంసరాజు. కళ్ళలో నిప్పు కణాలు వెలువడుతుండగా అది శత్రుసమూహాల ఎదుట నిలబడ్డది. ఆ వెనుకనే హిరణ్యగర్భుడి సేనా సమూహాలు ఆకాశం దద్దరిల్లేట్లు ఒకళ్లనొకళ్ళు ముందుకు రమ్మని పిలుచుకుంటూ, సింహాల్లాగా గర్జిస్తూ, ముందుకురికి, శత్రుసైన్యంతో తలపడ్డాయి.

వాళ్లలో దీర్ఘముఖుడు మొదలైన కొంగలు మునుపటి తమ పగను గుర్తుకు తెచ్చుకొన్నాయి. రోషంతోటీ, ఆవేశంతోటీ ప్రాణాలకు తెగించి శత్రు సైన్యం లోనికల్లా చొరబడ్డాయి. దారుణమైన గోళ్లతో రక్తం వచ్చేట్లు గీకుతూ, పొడుస్తూ, అతి కఠినమైన కాళ్ల దెబ్బలతోటీ, పిడికిలి గ్రుద్దులతోటీ, శత్రువులను ఘోరంగా నొప్పించాయి. అద్భుతమైన ఆ చర్యతో నెమలి రాజు సైన్యాలన్నీ నశించి, 'కేవలం కొన్ని పక్షులు మాత్రమే ప్రాణాలతో మిగిలినాయా' అనిపించింది. అంతలోనే- తను కూడా ఒక విధమైన ఎగిరే పక్షే కదా, అందుకని- "ఈ పక్షుల దారుణ మరణాన్ని నేను చూడలేను" అన్నట్లు సూర్యుడు అస్తమించాడు. పడమటి కొండల మరుగుకు పోయి దాక్కున్నాడు. చిరుచీకట్లు కమ్ముకుంటున్న ఆ సమయంలో పక్షుల గుంపులన్నీ యుద్ధాన్ని చాలించి తమ తమ ఇళ్ళకు పోయినై.

ఆ రాత్రికి అన్నీ నిద్రపోయి మరునాడు ఉదయం తిరిగి యుద్ధాన్ని మొదలు పెట్టాయి పక్షులు. ఆనాడు సాయంత్రం ఇంకా యుద్ధం భీకరంగా జరుగుతుండగానే, ఒంటరిగా కోటలోకి చొరబడింది కాకి- మేఘవర్ణుడు. మండుతున్న కట్టెపుల్ల ఒకటి దాని ముక్కున... ! (తర్వాత ఏమైందో..?!)



గురుదేవో మహేశ్వర:

ఐశ్వర్య రాసిన ఈ కథ, కొంచెం ఆలస్యంగా మీ ముందుకొస్తున్నది.. సంత్ కబీర్ ఏం చెప్పాడో తెలుసుగా?
రచన: యం.ఐశ్వర్య, ఐదవ తరగతి-బి, మహేంద్ర అకాడమీ, జహీరాబాదు

ఒక ఊళ్ళో రామయ్య, శివయ్య అనే ఇద్దరు స్నేహితులు ఉండేవాళ్ళు. ఇద్దరూ చక్కగా కలిసి మెలసి ఉండేవాళ్ళు. వారిలో రామయ్య కొంత ఉన్నతమైన కుటుంబంనుండి వచ్చాడు; శివయ్యేమో పేద కుటుంబం వాడు. డబ్బులున్న కుటుంబంవాడవటంతో రామయ్య బాగా చదువుకున్నాడు- శివయ్యపై చదువులకు వెళ్ళకనే పనిలోకి దిగాడు.

వాళ్ళ ఊరిలో చాలా పేరుగాంచిన శివాలయం ఒకటి ఉండేది. శివరాత్రి సందర్భంగా ఆ గుడిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతుంటై.

ఇద్దరు స్నేహితులూ శివాలయానికి వెళ్ళారు. చిన్నప్పుడు వీళ్లకు చదువు చెప్పిన ఉపాధ్యాయులవారే, ఇప్పుడక్కడ ఒక ఆధ్యాత్మిక ప్రవచనం ఇస్తున్నారు.

రామయ్య, శివయ్య ఇద్దరూ అక్కడే కూర్చొని ప్రవచనంమొత్తం విన్నారు. ప్రవచనం ఇద్దరికీ

నచ్చింది. ప్రవచనం ముగియగానే అందరితో బాటు లేచి ,గబగబా దైవ దర్శనం చేసుకొని, ప్రక్కనే ప్రాంగణంలో నిలబడ్డాడు రామయ్య. శివయ్యమటుకు ముందుగా వెళ్ళి తమ గురువుగారిని పలకరించి నమస్కరించాడు. అటుపైన వెళ్ళి దేవుడిని దర్శించుకొని తిరిగి వచ్చాడు.

"ఒరే, సోమయ్యా! పెద్దయినా నీకు తెలివి రాలేదురా, అందరికంటే ముందు వెళ్ళి దైవదర్శనం ముగించుకుంటే, ఆ తర్వాత ఇక స్వేచ్ఛగా ఏమైనా చేయచ్చు కదా. అట్లా కాక ముందు ఆ ముసలాయన్ని కలిసి, కబుర్లు చెప్పి, సమయం వృధా చేస్తివి; ఆలోగా అందరూ దైవదర్శనానికి పోయారు, నువ్వు క్యూలో వెనక నిలబడాల్సి వచ్చింది కదా! దేవుడికంటే నీకు ఆయనే ఎక్కువైనట్లున్నాడే?!" అన్నాడు రామయ్య, సోమయ్యను మందలిస్తున్నట్లు.

"దానిదేముందిరా, రామయ్యా! ఒకరు ముందైతే ఒకరు వెనకౌతారు. నువ్వు ముందు దేవుడిని దర్శించుకున్నావు. ఆ దేవుడి దగ్గరికి పోయే దారిని చూపించిన గురువును నేను దర్శించుకున్నాను. ఈయనే లేకపోతే నేను ఏమయి ఉందునో! ఆ దేవుడిని చూసేందుకు కూడా రాలేకపోదునేమో మరి!" అన్నాడు సోమయ్య.

కబీరుదాసు గురువును గురించి చెప్పిన మాటలు తలపుకు రాగా సిగ్గుతో తలవంచాడు చదువుకున్న రామయ్య.

మీకు ఈ పుస్తకం నచ్చిందా? మరైతే దీన్ని వృధా పోనివ్వకండి. మీదగ్గరున్న పుస్తకాలను మీ స్నేహితులతో తప్పకుండా పంచుకోండి. 'పుస్తకాలు పంచుకోవటం' బలే బాగుంటుంది! దానివల్ల అందరికీ లాభమే మరి!



భూతాలు చేసిన మేలు

దయ్యాలు, భూతాలు నిజంగా లేవులే గానీ, పిల్లలను అలరించేందుకు మటుకు భలే ముందుకొస్తాయి, ఇదిగో- ఈ కథలోలాగా....
రచన: యస్.ప్రవీణ్ కుమార్, ఐదవ తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.

అనగనగా అడవిని ఆనుకొని ఒక ఊరు ఉండేది. ఆ ఊళ్ళో నరసయ్య, నరసమ్మ అనే దంపతులు ఉండేవాళ్ళు. వాళ్ళ కొడుకు భరత్ చాలా మంచివాడు. ఒకరోజున అతను అలా సరదాగా తోటలో తిరుగుతూ ఉంటే అందమైన సీతాకోకచిలుక ఒకటి కనబడ్డది. అది చాలా అందంగా ఉంది; ఒకసారి వచ్చి అతని చెయ్యి మీదనే వాలి, మళ్ళీ దూరంగా ఉన్న పువ్వుల మీద వాలి, హడావిడిగా అటూ-ఇటూ తిరుగుతూ సందడి చేసిందది. దాన్నే కొద్ది సేపు చూసిన భరత్‌కి 'ఇక దాన్ని పట్టుకుందాం' అనిపించింది. ఆ సీతాకోక-

చిలుక వెంట పడ్డాడు. అయితే అది ఎంత సేపటికీ అతన్ని ఊరిస్తూ పోయింది గానీ, చేతికి మాత్రం చిక్కలేదు.

తెలివి వచ్చి చూసుకునే సరికి, భరత్ తమ తోటను ఎప్పుడో దాటిపోయి ఉన్నాడు. ఇప్పుడు ఎక్కడో, అడవిమధ్యలో ఉన్నాడు. వెనక్కి వెళ్ళే దారేది?!

అడవిలో కనబడిన దార్లను పట్టుకొని పోబోయాడు భరత్. అయితే ఎటు పోయినా మళ్ళీ తను వచ్చిన చోటికే వస్తున్నాడు!

అతను అట్లా కంగారు పడుతూ ఉంటే దగ్గరలో ఉన్న మర్రి చెట్టు తొర్రలోంచి గుసగుసగా ఏవో మాటలు వినవచ్చాయి. ఆ మాట్లాడుకుంటున్నవి మూడు దయ్యాలు! ఆ సంగతి మొదట వాడికి తెలీలేదుగానీ, ఆ తొర్ర దగ్గర చెవి పెట్టి జాగ్రత్తగా వింటే తర్వాత తర్వాత అర్థమైంది.

వాటిలో ఒక దయ్యం అంటున్నది: "నేను చనిపోక ముందు ఓ మందు కనిపెట్టాను. ఎవరికైనా పిచ్చి పడితే వాళ్ల చేతులకు ఆ మందును ఆరు రోజుల పాటు పట్టిస్తే చాలు- పిచ్చి పూర్తిగా నయమౌతుంది" అని.

అప్పుడు రెండో దయ్యం అన్నది: "నేను చనిపోకముందు నా దగ్గర మహిమగల కత్తి ఒకటి ఉండేది. దాంతో ఎవరు యుద్ధం చేస్తే వాళ్లదే విజయం!" అని.

ఇక మూడో దయ్యం అన్నది: "నా దగ్గర ఒక ప్రతిమ ఉంది. ఆ ప్రతిమను పూజించి ఏ వస్తువును కోరుకుంటే దాన్ని ప్రసాదిస్తుందది!" అని.



"ఏదీ, చూపించు - చూపించు" అని ముచ్చట పడ్డాయి మొదటి దయ్యాలు రెండూ. మూడోది వాటికి తన దగ్గరున్న

ప్రతిమను చూపించింది. "భలే ఉంది, మేమూ తెస్తాం, ఆగు- మేం చెప్పిన వస్తువుల్ని కూడా మాకు అందుబాటులోనే ఉంచుకున్నాం మేము!" అంటూ అవి రెండూ ఎగిరివెళ్ళి, క్షణాల్లో తమ తమ వస్తువులతో తిరిగివచ్చాయి. అన్నీ అట్లా ఆ వస్తువులను చూసుకొని మురిసిపోయాయి.


ఇదంతా వింటున్న భరత్‌కి ఏం చెయ్యాలో తోచలేదు. 'దూరంగా పారిపోదాం' అని ఎంత ప్రయత్నించినా మళ్ళీ అక్కడికే వస్తున్నాడాయెను! అంతలోనే దయ్యాలు మూడూ తొర్రలోంచి బయటికి వచ్చి, ఏవో కబుర్లు చెప్పుకుంటూ భరత్‌ను గమనించకనే ఎటో ఎగిరిపోయాయి.

అప్పుడుగాని భరత్‌కి భయం తగ్గలేదు. అవి ఇక దగ్గరలో లేవు గనక, అతని మెదడు మళ్ళీ ఓసారి చురుకుగా పనిచేయటం మొదలు పెట్టింది. అతను వెంటనే ఆ తొర్రలోకి దూరి, అక్కడున్న మూడు వస్తువులనూ అందుకొని, ప్రతిమకు నమస్కారం పెడుతూ "మా ఇంటికి దారి తీసే చెప్పుల్ని ప్రసాదించు" అని కోరుకున్నాడు. వెంటనే అతని ముందు రెండు చెప్పులు ప్రత్యక్షం అయ్యాయి. అతను వాటిని వేసుకోగానే అవి అతన్ని వాళ్ళ ఇంటికి చేర్చాయి!

ప్రతిమ సహాయంతో నరసయ్య, నరసమ్మ, భరత్ ముగ్గురూ త్వరలోనే గొప్ప ధనవంతులైపోయారు. వాళ్ళకిప్పుడు గొప్ప గొప్ప వాళ్లతో పరిచయాలూ, సంబంధాలూ ఏర్పడ్డాయి. అంతలోనే ఆ దేశపు రాజుగారికి ఒక సమస్య వచ్చింది. రాజ కుమారికి అకస్మాత్తుగా ఏదో అయ్యింది. పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తున్నది. ఆమె పిచ్చిని కుదిర్చేందుకు ఆయన అనేకమంది వైద్యులను పిలిపించాడు; కానీ ఎవ్వరూ ఆమెను బాగు చేయలేకపోయారు. ఆ వైద్యులలోనే ఒకడు, మాటల సందర్భంలో ఈ సంగతిని తెలియజేశాడు భరత్‌కు.

భరత్ వెంటనే బయలుదేరి వెళ్ళి నేరుగా రాజుగారిని కలిసి, రాకుమారికి వైద్యం చేసే అవకాశం ఇవ్వమని వేడుకున్నాడు. "నువ్వు వైద్యుడివి కావు గదా" అన్నారు రాజుగారు.

"అయినా ఒక అవకాశం ఇచ్చి చూద్దాం" అని 'సరే'నన్నారు. భరత్ తన దగ్గరున్న పసరు మందును రాకుమారి చేతులకు పట్టిస్తూ వచ్చాడు. రాకుమారి క్రమంగా బాగైంది. ఆరవనాడు మందును పట్టించాడో, లేదో- వాడి ముందు మూడు భూతాలు ప్రత్యక్షం అయ్యాయి: "ఒరే, నువ్వు మా వస్తువుల్నే ఎత్తుకెళ్తావురా?! 'మేం కనుక్కోలేం' అనుకున్నావా?! నిన్ను రప్పించేందుకేరా, ఇంత నాటకం ఆడింది!" అన్నాయి చేతులు చాపి వాడిని పట్టుకోబోతూ.



భరత్ చిటికెలో తప్పించుకొని, తన దగ్గరున్న కత్తిని బయటికి లాగి వాటితో యుద్ధం మొదలు పెట్టాడు. దీన్ని అక్కడున్న వాళ్లంతా నోళ్ళు వెళ్లబెట్టి చూస్తూ ఉండిపోయారు. సహజంగానే, ఆ యుద్ధంలో భరతుడే గెల్చాడు!

"ఒరే, కత్తి కూడా ఉంది కాబట్టి గెల్చావు. లేకపోతే నీ ప్రాణాలు తీసి ఉందుము!" అన్నాయి భూతాలు, ఓడిపోయాక.

వెంటనే భరత్ తన కత్తిని, మిగిలిన పసరును, ప్రతిమను కూడా వాటి ముందు పెట్టి, చేతులు జోడిస్తూ "ఇవి మీవే, నన్ను మన్నించండి. వీటిని నేను అసలు తీసుకునేవాడిని కాదు. కానీ వేరే దారి లేక అలా చేయాల్సి వచ్చింది. నాకుగా వీటితో ఏలాంటి అవసరమూ లేదు. ఇప్పుడు మీకెలా తోస్తే అలా చెయ్యండి" అన్నాడు నిజాయితీగా.

దయ్యాలు మూడూ నవ్వి, "నువ్వు నిజంగానే మంచి వాడివిలాగున్నావు. నిజానికి ఈ వస్తువులు మాకూ అవసరం లేదు. నీ దగ్గరే ఉంచుకో, కానీ వీటిని ఎక్కువ వాడకు. నీ శక్తిమీద నువ్వు ఆధారపడటమే మంచిది

ఎప్పటికైనా" అని చెప్పి మాయం అయిపోయాయి.

ఆ తర్వాత రాజుగారు భరత్‌ను సన్మానించి, రాకుమార్తెనిచ్చి పెళ్ళి చేస్తానన్నారు. "నాదంటూ సొంత ధనమూ లేదు; సొంత వైద్యమూ లేదు; సొంత బలమూ లేదు- నాకేమీ వద్దు" అన్నాడు భరత్.


"ఇవేవీ లేకున్నా కొండంత ధైర్యం ఉంది; కొండంత నిజాయితీ ఉంది- అవి చాలు. నేను ఇతన్ని పెళ్ళి చేసుకుంటాను" అన్నది రాకుమారి.


ఇంకేముంది, భరత్ రాజైపోయాడు! అటు తర్వాత అతను సొంతగా విద్యలన్నీ నేర్చుకొని, 'చక్కని రాజు' అని పేరు తెచ్చుకున్నాడు.

సెల్మాయ!

రాధ: మీ ఆయనకు మత్తు ఇవ్వకుండానే ఆపరేషన్ చేశారట! ఎలా సాధ్యమయ్యింది?

జ్యోతి: ఆ సమయంలో మావారు సెల్ లో మాట్లాడుతున్నారే!!





పోయిందా? దొరికిందా?!

రోడ్డు మీద ఒక్క బూటుతోనే నడుస్తున్న వ్యక్తిని చూసి జాలిపడ్డాడు ధర్మారావు.

పాపం! మీ బూటు ఒకటి పోయినట్లుందే? అన్నాడు సానుభూతిగా.


హహహ...పోవడం కాదు. ఒకటి దొరికింది, అన్నాడ వ్యక్తి ఖుస్సున నవ్వుతూ.

యల్కేజీ చిన్నోడు!

చింటూ: అమ్మా! తాతయ్య ఎప్పుడూ చదువుతుంటాడేం?

అమ్మ: అదా? భగవద్గీత.

చింటు: మరి పరీక్షలెప్పుడే?



మృదుబేరం!

డాక్టర్: మీకు ప్లాస్టిక్ సర్జరీ చెయ్యాలి. బాగా ఖర్చు అవుతుంది.

పేషంట్: ప్లాస్టిక్ నేనే తెచ్చుకోగలుగుతాను. కొంచెం తగ్గించుకోండి డాక్టరుగారూ!!



అబద్ధాలు ఆడితే ...

అబద్ధాల కథలు చెప్పటం నిజానికి చాలా బాగుంటుంది. అట్లా చక్కని అబద్ధపు కథలు చెప్పిన పిల్లలకు మేమైతే నిజం పటిక బెల్లమే ఇచ్చేవాళ్లం. మైత్రేష్ మటుకు ఒట్టి పటికను ఇప్పించాడు పాపం..
ఎం. మైత్రేష్, 9 వతరగతి, రిషీవ్యాలీస్కూల్, మదనపల్లి.

నందపురంలో ఉండే గోపి, చందు, గౌరిలకు వాళ్ళ మామయ్య అంటే చాలా ఇష్టం. వచ్చినప్పుడల్లా కొత్త కొత్త కథలు చెప్తాడు మామయ్య. అంతేకాదు, వీళ్ళతో కలిసి రకరకాల ఆటలు ఆడతాడు. మామయ్య వచ్చాడంటే పిల్లలకు పండుగే.

ఒకరోజు బాగా వర్షం పడుతోంది. సరిగ్గా అప్పుడే వచ్చాడు మామయ్య. బయట ఆడుకోవడానికి వీలులేక ఇంట్లో బోరుగా కూర్చున్న పిల్లలు మామయ్యని చూసి సంతోషం గా అరిచారు. మామయ్య వచ్చీ రావడంతోనే "ఆ! పిల్లలూ ఈరోజు ఒక కొత్త ఆట ఆడదాం" అన్నాడు.



"ఏం ఆట? " అన్నారు పిల్లలు మామయ్య చుట్టూ చేరి.

"దాన్ని అబద్ధాలు చెప్పే ఆట" అందాం. మీలో ఎవరైతే పెద్ద అబద్ధం చెప్తారో వాళ్ళకి బహుమతి ఇస్తాను" అన్నాడు మామయ్య.

మామయ్య మాటలకు పిల్లలు ఆశ్చర్యపోతూ "మా అమ్మ ఎప్పుడూ అబద్ధాలు చెప్పకూడదని చెప్పింది. నువ్వేమో చెప్పమంటున్నావు" అన్నారు.

"మీ అమ్మ అబద్ధాలు చెప్పొద్దంది కాని ఎందుకు చెప్పకూడదో చెప్పిందా?" అడిగాడు మామయ్య.

"చెప్పలేదు" అన్నారు పిల్లలు మూతి ముడుచుకుని.

"అయితే మరి అబద్ధాలు ఎందుకు చెప్పకూడదో మీకే తెలుస్తుందిలే కాని, ముందు ఎవరెంత బాగా అబద్ధం చెప్పగలరో చూద్దాం- కానీండి" అన్నాడు మామయ్య నవ్వుతూ.

"సరే! ఎలాంటి అబద్ధాలు చెప్పాలో మాకు తెలీదుగా, అందుకని ముందు నువ్వే మొదలుపెట్టు!" అన్నారు పిల్లలు.

"సరే, అయితే వినండి: ఒక తోటలో ఓ కుంటోడు, ఓ గుడ్డోడు, ఒక మూగోడు నడుస్తూ ఉన్నారు. గుడ్డోడు అన్నాడు: 'అదిగో చూడండి! అక్కడ తెల్ల కుందేలుంది. అబ్బ! ఎంత బాగుందో కదా! ' అని.



'అవును! అవును! కుందేలు చాలా బాగుంది. పట్టుకోండి-పట్టుకోండి' అన్నాడు మూగోడు.

మరుక్షణం కుంటోడు వేగంగా పరిగెత్తి ఆ కుందేలుని పట్టుకున్నాడు.

అప్పుడు మూగోడు అన్నాడు: 'దాన్ని పెట్టెలో పెట్టు. రేపు మనం దాని మీద ఎక్కి షికారుకి

వెళ్దాం' అని!

ఇంత మాత్రంచెప్పి ఆపాడు మామయ్య- "ఇంత మాత్రం చాల్లే.. దీని కంటే పెద్ద అబద్ధం ఎవరైనా చెప్పగలరా?" అన్నాడు కథ లోని అబద్ధాలకు నవ్వుకుంటున్న పిల్లలను చూస్తూ.



"నేను చెప్పగలను!" అని మొదలుపెట్టాడు గోపి. "ఒక రోజు నేను బడి నుండి వస్తుండగా చాలా పక్షులు -వీపు కిందికి, తల పైకి- పెట్టి ఎగురుతూ కనిపించాయి. నేను చూస్తూండగానే అవి అట్లా పైపైకి ఎగిరి ఎగిరి పోయినై. చివరికి ఆ రోజు రాత్రి చంద్రుడు వచ్చే సరికి అవన్నీ చంద్రుడిని చేరుకున్నాయి. పాపం అంత దూరం ఎగిరి వెళ్ళే సరికి వాటికి కాస్తా చాలా ఆకలి అయ్యింది. అప్పుడు చంద్రుడు వాటికి తేనె పోశాడు. ఆ తేనె కారి నా మీద పడుతుంటే నేను ఏంచేశానో తెలుసుగా, నా స్కూలు పుస్తకంతో పట్టేసుకుని కడుపునిండా తాగాను!" ఆపాడు గోపి.

"బలే చెప్పావు గోపీ -ఇప్పుడు చందూ, నువ్వు చెప్తావా?" అడిగాడు మామయ్య చందూని.

చందూ మొదలు పెట్టాడు: "సరే వినండి - ఒక రోజున బాగా వర్షం కురిసింది. హఠాత్తుగా పైనుండి మా ఇంట్లోకి కూడా వర్షం పడటం మొదలు పెట్టింది! 'ఏంటబ్బా' అనుకొని బయటికి వెళ్ళి చూస్తే ఏముందనుకుంటున్నారు?

మా ఇంటి పైన ఒక ఆవు నిల్చొని పెంకులు తినేస్తోంది! అప్పుడు మా నాన్న పైప్ ద్వారా ఆవుని కిందికి తెచ్చి, ఒక మూటలో కట్టి, సంతకి తీసుకెళ్ళి అమ్మేశాడు!" చెప్పాడు చందు.

"భలే! నీ అబద్ధం కూడా నాకు నచ్చింది.

ఇప్పుడు నీ వంతు, గౌరీ!" అన్నాడు మామయ్య నవ్వుతూ.

"అలాగే చెబుతాను- జాగ్రత్తగా వినండి మామయ్యా!" అంటూ గౌరి చెప్పడం మొదలుపెట్టింది. "ఒక రోజు నేను ఆకాశంలో ఎగురుతుండగా ఒక పేను కనిపించింది. దాన్ని పట్టుకుని నా తలలో వేసుకున్నాను. అప్పుడు అది నా జుట్టును నా కాళ్ళ వరకు వచ్చేట్లు చేసింది.



ఒక్కొక్క వెంట్రుకను నాకుతూ నా జుట్టునంతా అది నల్లగా చేసేసింది. దాంతో నేను చాలా అందంగా తయారయ్యాను. అప్పుడు నా అందానికి మెచ్చి ఆకాశం నుండి దేవతలు ఒక తెల్ల ఏనుగుని పంపారు. దాని మీద ఎక్కి స్కూలుకు వెళ్ళాను" అంది గౌరి.

"మీరందరూ భలే అబద్ధాలు చెప్పారురా! మీకందరికీ బహుమతులు ఇవ్వాల్సిందే!" అంటూ మామయ్య మూడు పటిక బెల్లం ముక్కలు తీసి ఒక్కొక్కరికి ఒక్కొకటి ఇస్తూ "వీటిని వదలకుండా తిన్నవాళ్ళకి అదనంగా ఒక బొమ్మ ఇస్తాను!" అన్నాడు.

పిల్లలు ఆత్రంగా ముక్కలను నోట్లో పెట్టుకున్నారు. వెంటనే "ఛీ! ఇది పటిక బెల్లం కాదు" అంటూ ఊసేశారు. "ఇదేంటి మామయ్యా! పటిక బెల్లం ఇలా ఉంది? " అన్నారు.

అప్పుడు మామయ్య "అది పటిక. పటిక బెల్లం కాదు. అబద్ధాలు చెబితే దొరికేది పటిక బెల్లంలా కనిపించే చేదు పటికే. నిజాలు చెబితేనే తియ్యని పటిక బెల్లం దొరికేది." అన్నాడు.

"మాకు పటిక బెల్లమే కావాలి మామయ్యా. అబద్ధాలు చెప్పంలే!" నవ్వారు పిల్లలు.



సంధ్యారాగం

మానస అప్పుడెప్పుడో తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు రాసిందట, ఈ కథని ! మరి ఈ మూడేళ్ళలోనూ తను ఇంట్లో ఉండి హాయిగా టివి చూడగలిగిందో మరి..?!

సాయి మానస ఎన్.సి, 12 వ తరగతి, రిషీవ్యాలీ స్కూల్

"సంధ్యా! టీవీ చూసింది చాలు, భోంచేద్దువు రా!" అమ్మ వంటింట్లోంచి కేక పెట్టింది. నాకు ఇష్టమైన షో వస్తోంది టీవీలో.

"ఐదు నిమిషాలు మమ్మీ!" సమాధానం ఇచ్చాను నేను.

"సమయానికి తినకపోతే ఆరోగ్యం పాడవుతుందమ్మా!" అంటూ అమ్మ వచ్చి టీవీ ఆపేసింది.

నేను కోపంగా డైనింగ్ టేబుల్ దగ్గరకి వచ్చి కూర్చున్నాను.

'ఛా! ఈరోజు షో ఎంత బాగుందో! నాకు ఆకలి కూడా లేదు. నేను భోంచేయకపోతే అమ్మకి ఏమిటట?' విసుక్కుంటూ వేడి వేడి అన్నం గబగబా మింగేసి టి.వి పెట్టాను. అయితే ఆస రికే షో పూర్తి అయిపోయింది.

"సంధ్యా! చదువుకోమ్మా!" పెద్ద గొంతుతో అరిచింది అమ్మ. నాకు తిక్క రేగింది. 'పొద్దున నిద్ర లేచినప్పటినుండి రాత్రి పడుకునే వరకూ ఈ గోలే!' అమ్మ మాట వినకుండా నేను నా గదిలోకి వెళ్ళి నిద్రపోయాను.

మాది మదనపల్లె. నేను బోర్డింగ్ స్కూల్లో చదువుకుంటున్నాను. సెలవలని ఇంటికి వచ్చా. అమ్మ ఎప్పుడూ చదువుకోమని ప్రాణం తీస్తుంది. నాన్న ఏదో ఒక పని మీద ఉంటాడు. నాకు టీవీ షోలంటే భలే ఇష్టం. కానీ అమ్మ వాటిని పూర్తిగా చూడనివ్వదు.



'రేపు మా దూరపు బంధువుల పెళ్ళికి అమ్మ-నాన్న వెళుతున్నారు. నా అదృష్టం బాగుంది- నన్ను రమ్మని అడగలేదు. రేపంతా హాయిగా టీవీ చూడొచ్చు' అని సంతోషపడుతూ నిద్రపోయాను.

పొద్దున ఎనిమిది గంటలకు గడియారం పాటకి నిద్ర లేచాను. ఆవలిస్తూ బాత్ రూమ్‌కి వెళ్ళి పళ్ళు తోముకుని, ముఖం కడుక్కుని సోఫాలో కూర్చుంటూ "అమ్మా! కాఫీ!" అని అరిచాను. ఎవరూ పలకలేదు.

"మమ్మీ! కాఫీ పెట్టావా?" ఇంకోసారి అడిగాను. అయినా సమాధానం రాలేదు. "ఏమైందబ్బా ......?" అనుకుంటుంటే పెళ్ళి సంగతి గుర్తుకొచ్చింది. నా నిద్ర మత్తు అంతా రకీమని ఎగిరి పోయింది. 'ఈరోజంతా నా ఇష్టం వచ్చినట్లు ఉండొచ్చు' అని భలే ఆనందం వేసింది.

ఇంటి ముందర పడిన వార్తా పత్రికను తెచ్చుకుని కాసేపు పేజీలు తిరగేశాను. నెట్ ఓపెన్ చేసి కాసేపు మెయిల్స్ చూసుకున్నాను. హోం వర్క్స్ గురించిన మెయిల్స్ ఉన్నాయి. 'అబ్బ! స్కూల్ కి వెళ్ళే ముందు వీటిని చూద్దాంలే' అనుకుని నెట్ మూసేసి వంటింట్లోకి వెళ్ళాను. రాత్రి అమ్మ కలిపి పెట్టిన దోశ పిండితో పెనం మీద ఓ దోశ పోశాను. ఇంతలో 'పోస్ట్' అని కేకతో పాటు ఓ ఉత్తరాన్ని తలుపు దగ్గర పడేసి వెళ్ళిపోయాడు పోస్టుమాన్. నేను తలుపు తీసి ఉత్తరం

చూశాను. నాన్నకి ఉత్తరం వచ్చింది. దాన్ని టేబుల్ మీద పెట్టాను. ఏదో మాడుతున్న వాసన. పెనం మీద వేసిన దోశ గుర్తొచ్చి వంటింట్లోకి పరిగెత్తాను. మాడిన వాసన భరించలేక ముక్కు మూసుకుని స్టవ్ ఆఫ్ చేశాను. పెనం మీద దోశ నల్లగా నిగనిగ-లాడుతోంది. నిట్టూరుస్తూ దానిని చెత్త కుండీలో వేశాను. 'అమ్మ చక్కగా దోశలు పోసి, కొసరి కొసరి వేస్తుంటే కమ్మకమ్మగా లాగించేదాన్ని కదా!' అనుకున్నాను.

'ఆకలేస్తోంది బాబోయ్!' అనుకుంటూ మ్యాగీ పొట్లాన్ని తీసుకుని దాన్ని చేసుకున్నాను. అది బాగా కుదిరింది. వేడి వేడిగా నూడిల్స్ తింటూ టీవీ చూద్దామని ప్లేట్ తీసుకుని వచ్చి సోఫాలో కూర్చున్నాను. పాదాలపై ఏదో ఉందనిపించి చూద్దును కదా, కాలి మీద బొద్దింక!!

"బొద్దింక! బొద్దింక!" అంటూ పెద్దగా అరిచి కాలు విదిలించాను. అది కాలు మీద నుండి జారి నేల మీద పాకుతూ పోతోంది. 'ఇప్పుడు అమ్మ ఉంటే ఆ బొద్దింకని బయట పారేసి ఉండేది కదా!' అనుకున్నాను దాని వైపే భయంగా చూస్తూ.



గబగబా తినేసి స్నానం చేసి 'హాయిగా టీవీ చూద్దాం' అనుకుంటుండగా బయట నుండి పాలాయన కేకేశాడు. తింటూనే వెళ్ళి తలుపు తీశాను.

"పొద్దున్నే పిలిస్తే పలకలేదు ఎవురూ. మళ్ళీ వచ్చా. తొందరగా గిన్నె తే పాపా!" అన్నాడు హడావుడి పడుతూ.

పాలు పోయించుకుని ఫ్రిజ్ లో పెడుతుంటే 'ట్రింగ్! ట్రింగ్!' మంటూ ఫోన్ మోగింది. పరిగెత్తుకుంటూ వెళ్ళి ఫోన్ తీశాను.

"జ్యోత్స్నా! ఎలా ఉన్నావు?" అని ఫోన్ లోంచి

ఎవరో పెద్దగా మాట్లాడుతున్నారు.

“రాంగ్ నంబర్!" అంటూ ఫోన్ పెట్టేశాను. మళ్ళీ మోగింది. ఎత్తితే మళ్ళీ అదే గొంతు. “జ్యోత్స్నా! నేను - గుర్తు పట్టలేదా?” అంటూ. “రాంగ్ నంబర్ అండీ!" విసుక్కున్నాను.

అది మళ్ళీ రింగ్ అవుతుంటే కోపంగా ఫోన్ వైర్లు పీకేశాను.

'ఇంతకు ముందు నాకీ సమస్య ఎప్పుడూ రాలేదు. ప్రతి కాల్ అమ్మ ఎత్తేది. ఇలా రాంగ్ కాల్స్ వస్తున్నా అమ్మ నెమ్మదిగానే ఉండేది ఇలా వైర్లు పీకేది కాదు...' నా ఆలోచనల్లో నేనుండగా డోర్ బెల్ మోగింది. చూస్తే కూరగాయలతను.

“మీరు తెమ్మన్న వంకాయలు, కాకరగాయలు, టమాటాలు, నిమ్మకాయలు తెచ్చానమ్మా. బీరకాయలు మాత్రం దొరకలా!" అన్నాడు. బ్యాగ్ తీసుకుంటుంటే "మొత్తం 78 రూపాయలు అయిందని అమ్మతో చెప్పు పాపా!" అన్నాడు.

“అమ్మ లేదులే, నేనే ఇస్తా ఉండు!" అని బీరువాలోనుండి డబ్బులు తీసి ఇచ్చా.

“కూరలన్నీ ఫ్రిడ్జిలో పెట్టమ్మా పాపా" అంటూ అతను డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడు.

'నన్ను చూస్తే కూరలు ఫ్రిడ్జిలో పెట్టనేమోనని అతనికి ఎందుకనిపించిందో? ఈరోజుల్లో పిల్లలందరూ ఇలాగే ఉన్నారేమో!!! ఏమిటి ఈ రోజు నాకు ఇన్ని ఆలోచనలు కలుగుతున్నాయి? ఒంటరిగా ఉండటం వల్లనా?'

కూరగాయలన్నీ ఫ్రిడ్జిలో పట్టలేదు. దానిలో సామానంతా తీసి సర్దితే కూరలన్నింటినీ పట్టించగలిగాను. 'హమ్మయ్య! ఇక స్నానం కుదరదులే, టీవీ షో మొదలయ్యే టైము అయ్యింది' అనుకుంటూ టీవీ ఆన్ చేయబోయా. అంతలోనే మళ్ళీ డోర్ బెల్ మోగింది. విసుక్కుంటూ వెళ్ళి తలుపు తీశాను.

“అమ్మ ఉందా బుజ్జీ!" అంటూ ఒకావిడ నన్ను తోసుకుంటూ లోపలకి వచ్చింది. ఆమె వెనకాల పెద్ద గ్రూపు ఉంది. అందరూ పట్టు

చీరలు, నగలతో పెళపెళలాడుతున్నారు.

“లేదాంటీ - పెళ్ళికెళ్ళారు!" అన్నాను.

“మా అమ్మాయి పెళ్ళి- వచ్చే మంగళ బుధవారాల్లో. కార్డు ఇవ్వడానికి వచ్చాం!" అంటూ కార్డు తీసి ఇచ్చిందావిడ. వాళ్ళు ఎవరో తెలియకపోయినా తల ఊపాను.



మధ్యాహ్నం దాటి పోయింది. వంట చేసుకుని తినే ఓపిక లేక, పాలు తీసి వేడి చేసుకుని తాగాను.

ఇంతలోనే మళ్ళీ ఎవరో తలుపు తడుతున్నారు. తీశాను- నీరసపడిపోతూ. వచ్చింది చాకలి. చేతిలోని ఇస్త్రీ మూటతో లోపలకి వచ్చి మూటని హాల్లో కింద పెట్టి యముడు చిత్రగుప్తుడిని లెక్క చూడమన్నట్లు "లెక్క చూడమ్మా!" అన్నాడు.

పద్దు పుస్తకం కోసం వెతుకుతున్న నన్ను చూస్తూ "పాపా! చూస్తా ఉండాది లెక్కల పుస్తకం కోసమేనా?! - అదిగో, ఆ టివి కిందేసిన గుడ్డ ఉళ్ళా - దాని కింద చూడు ఉంటది!" అన్నాడు.

'నాకు తెలియని విషయాలు బయటివాళ్ళకి బాగా తెలుసే' అని నవ్వుకుంటూ పుస్తకం తీసి లెక్క చూశాను.

చాకలి వెళ్ళిపోయాక అలసటతో, ఖాళీ కడుపుతో అలాగే సోఫాలో పడి నిద్రపోయాను.

“సంధ్యా, లేమ్మా! " అని అమ్మ నన్ను నిద్ర లేపింది.

“వచ్చేశావా మమ్మీ" అంటూ అమ్మని గట్టిగా కౌగలించుకున్నాను. “మమ్మీ! ఈరోజు నేనస్సలు టీవీ చూడలేదు. ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తూనే ఉన్నారు. పైగా ఫోన్ కాల్స్! నువ్వు రోజూ ఎన్ని పనులు చేయాలో ఇప్పుడు

నాకు తెలిసింది. నువ్వు ఈ పనులన్నీ చేసుకుంటున్నావు కాబట్టే, నాకు అన్నీ చక్కగా జరిగిపోతున్నాయి. నీవల్లే టివి చూడటానికి టైమ్ దొరుకుతోంది. ఇదంతా తెలుసుకోకుండా, నీమీదికే ఎగిరిపడుతుంటాను. ఇప్పుడు బుద్ధి వచ్చింది. ఇంకెప్పుడూ విసుక్కోను - నువ్వు చెప్పిన మాటల్లా వింటాను!" అన్నాను.

అమ్మ చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వులో చాలా అర్థం తోచింది నాకు.

అడ్వాన్సు దెబ్బలు!

రాజారావు: ఏంటిరా?! మీ అబ్బాయిని అలా కొడుతున్నావు?

సుబ్బారావు: రేపు వీడి రిజల్ట్స్ వస్తాయిరా!

రాజారావు: దానికి కొట్టడం దేనికి?

సుబ్బారావు: నేను ఇవాళ్లే ఊరికెళుతున్నానుగా, మరి?!





మరపు!

దాసు: డాక్టరు గారూ, ఈ మధ్యన నాకు ఏదీ గుర్తుండటం లేదండీ.

డాక్టరు: ఈ సమస్య మీకు ఎప్పట్నుంచీ?

దాసు: ఏ సమస్య?

సగం!

టీచరు:శేషూ! పరీక్షలో అన్నింటికీ సగం జవాబే రాశావెందుకు?

శేషు: హాఫియర్లీ పరీక్షలు కదండి టీచర్!!!





ఆగం!

జడ్జి: యాక్సిడెంట్ చేసికూడా నువ్వు బస్సు ఎందుకు ఆపలేదయ్యా?

డ్రైవరు: మాది నాన్‌స్టాప్ సర్వీసు సార్..



సబ్బుబిళ్ళ

ఈ కథ బలేఉంది. అయినా ఇందులో ఓ తప్పు ఉంది (ఆటో?) మీరూ చదివి కనుక్కోగలరేమో చూడండి!
మూలం: 'సకీ' రాసిన ఆంగ్ల కథ.
అనుసరణ: పిడూరి గౌతమ్, 9 వ తరగతి, రిషివ్యాలీ స్కూల్, మదనపల్లి, చిత్తూరు జిల్లా.

హైదరాబాదు ఎన్ టి ఆర్ పార్కులో ఒక బెంచీ మీద కూర్చొని ఉన్నాడు ఆకాష్. సాయంత్రం 6.30 అయింది. పార్కంతా ప్రశాంతంగా ఉంది. రోజూ ఇలాగే వచ్చి బెంచీ మీద కూర్చుంటాడు ఆకాష్. ఎవరినీ చూడకుండా, ఎవరితో మాట్లాడకుండా తనలో తాను ఆలోచించుకుంటూ, పుస్తకాలు చదువుకోవడం అంటే అతని కి చాలా ఇష్టం.

చిన్నప్పటినుండీ వాడు అంతే. ఇప్పుడు అయితే హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆఫీసు నుండి రాగానే ఏదో ఓ పుస్తకం పట్టుకుని ఇలా వస్తాడు.

ఈరోజు ఆకాష్ పార్కుకి వచ్చేప్పటికి అతను ఎప్పుడూ కూర్చునే బెంచీ మీద ఒక మనిషి కూర్చుని ఉన్నాడు. అతనికి 25-30 ఏళ్ళ వయస్సు ఉంటుంది. ఆకాష్ అతని ప్రక్కనే కూర్చున్నాడు. "ఛీ! నేనెంత తెలివితక్కువ వాడిని! ఊరుగాని ఊరికి వచ్చేప్పుడు ఎంత

జాగ్రత్తగా ఉండాలి- థూ థూ!' తనలో తనే గొణుక్కుంటున్నాడతను.

'వీడెవడ్రా బాబూ!' అనుకున్నాడు ఆకాష్. అయినా అతనితో మాట్లాడాలనిపించింది- ఎందుకనో మరి! "మీరు మంచి మూడ్‌లో లేనట్లున్నారు?" అడిగాడు అతన్ని.

"మీరు నా స్థితిలో ఉంటే ఇలానే ఉంటారు" అరిచాడు ఆ వ్యక్తి.

"ఏమైంది మీకు?" అడిగాడు ఆకాష్.

"నా జీవితంలో నేనెప్పుడూ ఇంత తెలివితక్కువ పని చేయలేదు"

"అదే! ఏమిటండీ ఆ పని?"

"నేను మచిలీపట్నం నుండి ఆఫీసు పని మీద వచ్చా. నాకు హైదరాబాదులో ఎవరూ లేరు. పద్మినీ హోటల్లో రూము అద్దెకు తీసుకున్నా. సబ్బు తీసుకురావడం మర్చిపోయాను. నాకు హోటల్ సబ్బు నచ్చదు. అందుకని కొంచెం దూరంలో ఉన్న కొట్టుకెళ్ళి సబ్బు కొన్నా. ఆ తర్వాత, పద్మినీలో తినేందుకేమీ దొరకదు కాబట్టి, టిఫిన్ కోసం అటూ ఇటూ తిరిగాను. మళ్ళీ పద్మినీకి వెళ్ళాలంటే దారి తప్పిపోయాను. ఇప్పుడు చూసుకుంటే ఆటోకి డబ్బులు లేవు. అలిసిపోయాను. ఇక్కడ కూర్చున్నాను. నా దగ్గర రెండు రూపాయలు ఉన్నాయి అంతే" కళ్ళలో నీళ్ళు తిరిగాయి అతనికి.



'వీడు దొంగా, లేకపోతే ఇదంతా నిజమా? ' అని ఆలోచించాడు ఆకాష్.

"నాకు ఇట్లా జరిగిందంటే మీరు నమ్మట్లేదు కదూ? నా మాట ఎవరు నమ్ముతార్లే.."

"అబ్బే! అట్లా ఏం లేదు. నాకు కూడా ఇలాగే జరిగింది- ఇక్కడ కాదు, ఇటలీలో. చివరికి ఫోన్ చేసి అడ్రస్ కనుక్కున్నాను. కానీ- కానీ --- మీరు కొన్న సబ్బు చూపిస్తే .. ఎవరైనా

నమ్ముతారు" అన్నాడు ఆకాష్ కొద్ది బిడియంగా.

ఆ వ్యక్తి లేచి బెంచీ అంతా వెతికాడు. తెల్లబోయాడు. 'అయ్యో ఎక్కడో పడిపోయి ఉంటుంది' అన్నాడు తత్తరపడుతూ.



"మీకు చాలా నిర్లక్ష్యమనుకుంటాను. ఒకే రోజులో హోటల్నీ, సబ్బునీ పోగొట్టుకున్నారే!" నవ్వాడు ఆకాష్.

"హు!" అని వెళ్ళిపోయాడు అతను.

'మోసగాడు. నాకే టోపీ వేయాలని చూస్తాడా! ఈ నగరాల్లో అంతే. అంతా దోపిడీలు, దొంగతనాలు. అందుకనే అందరూ తెలివిగా ఉండాలి నాలాగా. మొదటి చూపులోనే పట్టేశా .... వీడు మోసగాడని. అయినా మోసం చేయాలంటే అలాంటి కథ ఎందుకు అల్లాడు? ఎవరైనా పట్టేసుకోరూ? సబ్బుని గురించి ఎవరూ అడగరనుకున్నాడా!!! ఏమో ... సబ్బంట సబ్బు! గాడిద గుడ్డేం కాదూ!' అని నవ్వుకుంటూ కూర్చున్నాడు ఆకాష్.

"ఏమటంత నవ్వుతున్నావు నాయనా?" అన్నాడు అప్పుడే అక్కడకొచ్చిన ముసలి తాత. తాత ఎప్పుడూ అక్కడే తిరుగుతుంటాడు.

"ఏం లేదు తాతా! ఒకడు నాకు టోపీ వేయాలని చూశాడు - నేను పట్టేసుకున్నా"

"ఓహో! ఈ పార్కులో జాగ్రత్తగా ఉండాలి నాయనా. అందరికీ టోపీ వేయాలని చూస్తారు" అన్నాడు తాత బెంచీ మీద కూర్చుంటూ.

"అవును తాతా! నేను మోసగాళ్ళను చిటెకెలో పట్టేస్తా" అన్నాడు ఆకాష్.

"అందరూ అలాగే అనుకుంటారు నాయనా"

అనుకుంటూ తాత లేచి అక్కడనుండి వెళ్ళిపోయాడు.

'ఈయనొకడు!' అనుకుంటూ ఆకాష్ కూడా లేచి, చెప్పులు సరి చేసుకోవడానికి కిందికి వంగాడు. బెంచీ కింద ఏదో పాకెట్టు ఉంది. ఆకాష్ దానిని తీసి చూస్తే – సబ్బు బిళ్ళ.

'అయ్యో! తప్పయిపోయిందే.... అతని కథ నిజమేనన్నమాట. నేనేదో అనుకుని నానా మాటలు అనేశానే. ఇప్పుడు అతను ఎక్కడున్నాడో!' అనుకుంటూ ఆకాష్ రోడ్డు దాటి అటూ ఇటూ తిరిగాడు. 'అతని దగ్గర డబ్బులు కూడా లేవు కదా పాపం!' అనుకుంటూ ఓ బ్రిడ్జి మీదకు వచ్చాడు. బ్రిడ్జి చివర కూర్చుని ఉన్నాడు ఆ వ్యక్తి. చాలా దు:ఖంలో ఉన్నట్లున్నాడు.

"ఏమండీ! ఏమండీ! మీ సబ్బు దొరికింది!" ఆకాష్ పెద్దగా అరిచాడు. ఆ వ్యక్తి వైపుకి పరిగెత్తి "మీ కథకి ఋజువు దొరికింది. ఇదిగోండి, మీ సబ్బు!" అంటూ సబ్బుని అతనికి ఇచ్చాడు.

"మీకెలా దొరికిందిది?!" అన్నాడు ఆ వ్యక్తి ఆశ్చర్యంగా.

"బెంచీ కింద ఉంది. సారీ - మీరు అబద్ధం చెప్తున్నారని అనుకున్నాను. సబ్బు దొరికిన వెంటనే మీ కోసం పరిగెత్తుకొచ్చాను.. సరే, ఈ వంద రూపాయలుంచండి. నేను బంగాళా ఫ్లాట్స్ నెం 39 లో ఉంటాను. రేపు వచ్చి ఇచ్చేద్దురుగాని!" అంటూ జేబులోనుండి 100 రూపాయలు తీసి అతని చేతిలో పెట్టాడు ఆకాష్.

"థాక్స్ అండీ! వెళ్ళొస్తానండీ!" అంటూ అతను వెళ్ళిపోయాడు.

'పాపం నేను ఆ డబ్బులు ఇవ్వకపోతే ఎంత బాధపడి ఉండేవాడో' అనుకుంటూ పార్కుకి వచ్చాడు ఆకాష్. అక్కడ ముసలి తాత బెంచీ కిందకి వంగి దేనికోసమో వెతుకుతున్నాడు.

"ఏం తాతా! దేని కోసం వెతుకుతున్నావు" అన్నాడు ఆకాష్.

"ఏం లేదు నాయనా - నా సబ్బు బిళ్ళ ఇక్కడేమైనా పడిపోయిందేమోనని...."

"ఆఁ!!!!!



మారిన మనిషి

'కష్టాల్లో ఉన్నవాళ్ళకు సాయం చేయాలి" అంటూ ఈ కథ రాసి పంపింది స్నేహలత.. కథలో మెలికలు కొంచెం ఎక్కువే ఉన్నట్లున్నాయి, అయితేనేమి, సొంత కథ సొంత కథే!

కె.స్నేహలత, కె.కరీనా అంజుం, ఆరవ తరగతి, శ్రీగాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్, అనంతపురం.

అనగనగా ఒక ధనవంతుడు ఉండేవాడు. ఆయన పేరు వీరనరసింహుడు. ఆయన చాలా పిసినారివాడు. ఒకరోజున ఆయన దగ్గరికి పేదవాడు ఒకడు వచ్చాడు. తన కూతురికి వివాహం చేయడానికి కొంతధనం అడిగాడు. కానీ వీరనరసింహుడు ఇవ్వలేదు.


పేదవాడు బ్రతిమలాడాడు. కాని ఫలితం లేకపోయింది- వీర నరసింహుడి మనసు కరగలేదు.

పైపెచ్చు, "నన్నే దబాయిస్తావా?" అని పోలీసులను పిలిచి ఆ పేదవాడిని జైల్లో పెట్టించాడు.



పాపం పేదవాడి భార్యా పిల్లలంతా భోరుభోరుమన్నారు. పేదవాడి భార్య వచ్చి వీరనరసింహుడి తల్లితో మొరపెట్టుకున్నది. తన భర్తని విడిపించమని కోరింది. వీరనరసింహుడి తల్లి వాళ్ళకు ధైర్యం చెప్పి, ఓ ఉపాయం ఆలోచించింది.

తమ కుటుంబ వైద్యుడిని పిలిపించి, ఆయనకు సంగతంతా వివరించి, "తమరు నాకు సహాయం చేయాలి!" అని కోరింది. వైద్యుడు అందుకు అంగీకరించాడు.



వెంటనే ఆమె పరుపు మీద పడుకొని దుప్పటి ముసుగు వేసుకున్నది. "నేను జబ్బుతో ఉన్నానురా, నన్ను మంచి డాక్టరుకు చూపించండి" అని సందేశం పంపింది భటులతో. వీరనరసింహుడు వచ్చి తల్లిని పలకరించాడు. కానీ ఒక్క డాక్టరును కూడా పిలవలేదు; ఒక్కపైసా కూడా ఖర్చుపెట్టలేదు.

అంతలో తల్లి ఆరోగ్యం బాగాలేదని ఆమె రెండవ కొడుకు పేరు వీరకృష్ణకు సందేశం అందింది. అతను వెంటనే తన తన ఖర్చుతో పెద్ద వైద్యులను పిలుచుకొని వచ్చి చేరుకున్నాడు. తల్లి వద్దకు చేరి కూర్చున్నాడు. ఆ వైద్యులు తల్లిని పరీక్షించబోగా, "మా కొడుకుతో కొంచెం మాట్లాడతాను- ఒక్కసారి బయటికి వెళ్ళ గలరా?" అని డాక్టర్లను కోరింది తల్లి. "సరే" అని బయటకు వెళ్ళారు వాళ్ళు.

తల్లి లేచి కూర్చొని జరిగినదంతా చెప్పింది చిన్నకొడుక్కు. "నిన్ను రప్పించేందుకే ఇలా జబ్బు పడ్డట్లు నాటకం ఆడాను- నిజానికి నాకేమి, బాగున్నాను. ఎలాగో ఒకలాగా మీ అన్నను మార్చు. అలాగే ఆ పేదవాడిని విడిపించు నాయనా" అని ప్రాధేయపడిందావిడ.

అప్పటికప్పుడు ఒక ఉపాయం ఆలోచించాడు

వీరకృష్ణ. "అమ్మను చూసేందుకు పట్నం నుండి గొప్ప డాక్టర్లను పిలిపించాను. వాళ్ళు ఇక్కడ ఉండగా మీరంతా ఆరోగ్య పరీక్షలు చేయించుకోండి" అన్నాడు అందరితోటీ.

"ఊరికే చేస్తారుగా, నాదేం పోతుంది?" అని వైద్యపరీక్షలకొచ్చాడు వీరనరసింహుడు. ముందుగా నిర్ణయించిన ప్రకారం వైద్యులు ఆయన ఫలితాలను చూడగానే పెదవి విరిచి, గుసగుసలాడుకున్నారు.



వాళ్ళ ముఖాలు గమనించిన వీర నరసింహుడికి వెంటనే ఆయాసం మొదలయింది. "మీకు ఎలా చెప్పాలో తెలీటం లేదు. మీ గుండె... " అన్నారు డాక్టర్లు. "మరో వారం రోజులు ఉంటే ఉన్నట్లు. ఎందుకు, ఇలా తాస్కారంగా ఉన్నారు? మీకంటే మీ అమ్మ ఆరోగ్యమే నయంగా ఉంది!" అని చీవాట్లు పెట్టారు.

ఆ క్షణం వరకు బాగున్న వీర నరసింహుడు వెంటనే నీరసించి పోయాడు. మర్నాటికల్లా పూర్తిగా జబ్బు పడ్డాడు. "ఎంత డబ్బయినా పర్లేదు డాక్టర్, నా గుండెను కాపాడితే అంతే చాలు" అన్నాడు.

"ఎవరమైనా చేయగలిగింది పెద్దగా లేదు. ఏమైనా పుణ్యకార్యాలు చేయండి. ఎవరైనా పేదవాళ్ళకు అన్యాయం చేశారేమో చూడండి- ఈ వారం పది రోజుల్లో మీరు చేసిన తప్పులన్నిటినీ సరిదిద్దుకోండి. మాకు చేతనైనంత మేము కూడాచేస్తాం" అన్నారు డాక్టర్లు కొంచెం మెత్తబడుతున్నట్లు.

వీర నరసింహుడు వెంటనే తన తల్లిని , తమ్ముడి ని రమ్మని, వాళ్ళ కాళ్ళు పట్టుకుని క్షమాపణ అడిగాడు. తను అప్పులిచ్చి పీడిస్తున్న బీదవాళ్ల పత్రాలను చింపి పడేశాడు. పోలీసు స్టేషన్లో మ్రగ్గుతున్న పేదవాడిని విడిపించాడు. వాళ్ల కూతురి పెళ్ళికి సాయం చేశాడు. తాను ఉండే వారం-పది దినాలూ

మంచి పనులు చేస్తూ గడపాలని నిశ్చయించుకున్నాడు.

ఆలోగా పట్నం వెళ్ళిన డాక్టర్లు వీరనరసింహుడిని పిలిపించుకొని మరిన్ని పరీక్షలు నిర్వహించారు. "మీ గుండె కొంచెం బలహీనమైంది అంతే. ప్రాణాపాయం లేదు. టానిక్కులు వాడండి" అని మందులు రాసిచ్చారు.

వీరనరసింహుడు సంతోషంగా ఊరికి తిరిగి వచ్చాడు. తను చేసిన పుణ్యకార్యాలవల్లే తన ఆరోగ్యం బాగైందని అతనికి గట్టిగా అనిపించింది. దానికి తోడు, వాళ్ళ అమ్మ "ఒరే, నా ఆరోగ్యమూ బాలేదు- నీదీ అంతంత మాత్రమే. బ్రతికి ఉండగా ఇంత మంచి పేరు సంపాదించుకుందాం రా" అనేసరికి, అతను నిజంగానే మారిపోయాడు. త్వరలోనే "వీరనరసింహుడు మంచివాడు. దయామయుడు" అని పేరు తెచ్చుకున్నాడు.


పొంచి, బుజ్జగించి, పొగడి, టక్కరిమూక
మంచివారి మోసగించుచుండు
కాకి జున్నుముక్క కాజేసెరా నక్క
లలిత సుగుణజాల! తెలుగుబాల!

సాటివానితోడ జగడమాడగరాదు
తీరుపులకు పరుల జేరరాదు
కొంటెకోతి గడ్డ కొట్టె పిల్లులనోట
లలిత సుగుణజాల! తెలుగుబాల!

ఆశపోతువాని కానందమది కల్ల
ఆపదలకు లోభమాకరమ్ము
పసిడి కంకణమ్ము బ్రాహ్మణు వంచించె
లలిత సుగుణజాల! తెలుగుబాల!

బావినీటిలోన ప్రతిబింబమును చూపి
సింహమును శశి సంహరించె
తగును పాయమున్న తప్పునపాయంబు
లలిత సుగుణజాల! తెలుగుబాల!


తెలుగు బాల! రచన: కీ.శే. శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు "కరుణశ్రీ"



లేత మొక్కలు

'ఈ నూతన సంవత్సరాన్ని మంచి ఆలోచనలతో నింపాలి' అని చెప్పే ఈ కథ చదివి ఏమనిపించిందో చెప్పండి...
రచన: శ్రీమతి ఆదూరి హైమవతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, బెంగుళూరు.

"ఒరేయ్! పిల్లలూ! ఈ రోజుతో 2013 పూర్తయి, 2014- అదేరా, కొత్త సంవత్సరం- మొదలవుతున్నది కదా?! ఇంకో 4 నెలల్లో మీరంతా పై తరగతులకు కూడా వెళ్ళ బోతున్నారు! మరి మీరు ఒక్కోరూ చెప్పండి- ఏమేం చదువులు చదవాలనుకుంటున్నారు, పెద్దయ్యాక ఏ ఏ ఉద్యోగాలు చేద్దా- మనుకుంటున్నారు? కొత్త ఏడాదిని కొత్త ఆలోచనలతో మొదలెట్టాలిగా, మరి?! ముందుగానే మీ లక్ష్యాలను నిర్ణయించుకుని, ఆ వైపుగా అడుగులు వేయాలి. రామూ! నువ్వు మొదలుపెట్టు, ముందు!" పెద్ద పంతులుగారు రామూ వైపు చూడగానే వాడు లేచాడు-



"మా నాయనగారు నన్ను ఒక పెద్ద డాక్టర్ను చేయాలనుకుంటున్నారు పంతులుగారూ!

అట్లా అని ఆయన రోజూ మా అమ్మతో అంటుంటారు"

అవునా! ఆయన అట్లా ఎందుకు అనుకుంటున్నారో తెల్సా, నీకు?"



"పంతులుగారూ! డాక్టరైతే, ఎంచక్కా బోలెడంత డబ్బు సంపాదించవచ్చుటండీ! ఒట్టి కడుపునొప్పితో వచ్చినవాళ్ళకైనా సరే, ఆపరేషన్ చేసి, వేలకు వేల రూపాయల బిల్లు వేయవచ్చుట! అందుకని మా నాన్న నన్ను డాక్టర్‌ను చేసి, నేను సంపాదించే డబ్బుతో నగరంలో పెద్ద బంగళాలు కట్టిస్తారట!" నిజాయితీతో చెప్పాడు రాము.

"ఓహో! మరి నీ మాటేంటి, మాధవ్?!"

"పంతులుగారూ! మా నాయన నన్ను పెద్ద లాయర్ను చేసేస్తారట"

"అవునా! బాగుంది బాగుంది! ఎందుకో తెలుసా, నీకేమన్నా?"

"ఓ! లాయరైతే ఒక్కో కేసూ ఐదు నుంచీ పదేళ్ళు నడిపి, ఊరికే బోలెడంత ఫీజు వసూలు చేసేయొచ్చు! చాలా డబ్బులు వస్తాయి. దాంతో మేం చక్కని పెద్దపెద్ద మేడలు కట్టుకోవచ్చు!" చేతులు త్రిప్పుతూ అమాయకంగా చెప్తున్న మాధవను చూసి నవ్వారు పంతులుగారు. "మరి నీ సంగతేంటి ఆనంద్?" అన్నారు.

ఆనంద్ లేచి "పంతులుగారూ! మా నాయన నన్ను ఇంజనీర్‌ను చేస్తారుట! బిల్డింగులూ, ప్రాజక్టులూ కడితే దొంగడబ్బు కూడా చాలా వస్తుందట. సిమెంటుకు బదులు బూడిద, ఇంకా ఏవేవో కలపవచ్చుట.. ఇంకా.." సిగ్గుపడుతూ తలవంచుకున్నాడు వాడు. "చెప్పవోయ్! సిగ్గెందుకూ?.." అని ప్రోత్సహించారు పంతులుగారు.

"మరీ.. మరీ.. నా పెళ్ళప్పుడు మరింత కట్నం తీసుకోవచ్చుట పంతులుగారూ!" అన్నాడు వాడు. తరగతిలో పిల్లలంతా ఫక్కున నవ్వారు.

"సరి సరి. మరి నీమాటేంటి, వాసూ?"

"పంతులుగారూ! మా అమ్మ నన్ను ఒక పెద్ద పోలీసాఫీసర్ను చేస్తుందిట! అప్పుడు ఎంతో మంది నన్ను చూసి భయపడతారట! తమ మీద కేసులు తప్పించమని చెప్పి చాలామంది డబ్బులు కూడా తెచ్చిఇస్తారట!" చాలా ఉత్సాహంగా చెప్పాడు వాసు.

"అబ్బో పోలీసాఫీసర్! సలాం!" అంటూ ఎగతాళి చేశారు పిల్లలంతా.

"మరి నీ సంగతేంటిరా, నాగరాజూ?"

"పంతులుగారూ ! ఈ చదువులేవీ నా వంటికి పడవంటండీ! అందుకని కాస్త హైస్కూల్ దాకా వచ్చాక, మానాయన చేసే సరుకుల వ్యాపారం నాకు అప్పజెపుతారటండి! బియ్యంలో ఎంత చెత్త కలపచ్చో, ఎన్ని రాళ్ళు కలపచ్చో అప్పుడు నేర్పిస్తారట! నూనెలో కూడా బాగా కల్తీ చేయవచ్చు! ఏ ఉద్యోగం చేసినా ఇంత లాభం రాదట అయ్యవారూ!" అన్నాడు నాగరాజు. తర్వాత మరికొందరు అబ్బాయిలు కాంట్రాక్టర్లం అవుతామనీ, కొందరు మంత్రులం అవుతామనీ- ఇట్లా రకరకాలుగా చెప్పారు.



"ఇక అమ్మాయిల వంతు- అమ్మా, లావణ్యా! నీ ఆలోచన ఏంటో చెప్పు, మీ అమ్మానాన్నలు నిన్ను ఏం చదివిస్తారట?"

"పంతులుగారూ! నాకు హైస్కూల్ వరకూ చదువు చెప్పించి, అటుపైన పెళ్ళిచేసేస్తారుట. అమ్మాయిలు ఎక్కువ చదువుకో- కూడదటండి!" చెప్పింది లావణ్య.

ఇలాగే మరి కొంత మంది అమ్మాయిలు చెప్పాక- సుగుణ లేచి నిల్చుని చెప్పసాగింది: "పంతులుగారూ! మా అమ్మా-నాన్నా నన్ను ఒక మంచి టీచరును చేయాలను- కుంటున్నారు. ఎందుకంటే ఇప్పుడు పిల్లలకు చాలామందికి మానవతా- విలువలైన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు తెలీవుట. అందుకని వాళ్లంతా పెద్దయ్యాక అబద్ధాలు చెప్తున్నారట; అన్యాయాలు చేస్తున్నారట; లంచాలు తీసుకుని, మోసాలు చేస్తూ డబ్బు సంపాదిస్తున్నారుట.

చిన్నతనంలోనే, ప్రాథమిక పాఠశాలలోనే మంచి అలవాట్లు నేర్పితే, సమాజం మొత్తం బాగుపడుతుంది కదా; ఇప్పుడు జరిగే అన్యాయాలన్నీ ఆగిపోతాయి! అందుకే మా అమ్మా నాన్నా నన్ను మంచి టీచరుగా తీర్చి దిద్దుతామనేది. పెద్దయినాక నేను పిల్లలందరికీ మంచి నేర్పాలట!" అన్నది.

పంతులుగారు చప్పట్లు కొట్టారు. "చూడండి పిల్లలూ, సుగుణవాళ్ళ అమ్మానాన్నల ఆలోచనలు ఎంత గొప్పగా ఉన్నాయో చూశారా? మీరందరూ మంచివాళ్ళయి, తోటివారికి, పేదలకు సాయం చేస్తూ సమాజానికి మేలు చేస్తే అంతా సుఖ సంతోషాలతో ఉంటారు కదా! ఏం చదువుకున్నా, ఏ వృత్తి చేపట్టినా న్యాయంగానే చేయాలి. గాంధీ మహాత్ముడు 'లాయరే కదా, అయినా ఆయన ఎన్నడూ అసత్య వాదనలు చేయలేదు. సత్యంగా 'అహింసా పరమో ధర్మః' అనే సూక్తిని పాటించి స్వతంత్ర్యం సాధించాడు.. మరి మీరంతా..." అంటున్న పంతులుగారు మాట పూర్తిచేయకుండానే, పిల్లలంతా ఒక్క గొంతుగా అరిచారు- " అర్థం అయ్యింది పంతులుగారూ! ఈ నూతవ సంవత్సరం నుండీ మేమంతా మంచితనం కోసం పాటు పడతామని, మానవతా విలువలు పాటిస్తామని ప్రమాణం చేస్తున్నాం. సత్య మార్గాన్నే అనుసరిస్తాం, ప్రామిస్!" అని.



పుట్టిన రోజు పాఠం

రచన: శ్రీమతి యం. స్నేహలత, (ఇ-మెయిలు ద్వారా)

ఒక ఊళ్ళో సిద్ధార్థ్, సిరి అనే అన్నాచెల్లెళ్ళు ఉండేవాళ్ళు. ఓసారి వాళ్ళిద్దరూ అనుకున్నారు- 'పుట్టినరోజునాడు నాన్నకి ఏదైనా కానుక ఇవ్వాలి' అని.

'మరి, ఎట్లాంటి బహుమతి ఇస్తే బాగుంటుంది?!" అని ఆలోచించడం మొదలు పెట్టారు. 'బొమ్మలు, చాక్లెట్లు...' ఇట్లా రకరకాల ఆలోచనలు వచ్చాయి వాళ్లకి.

అయితే సిరి తన పాఠాల్లో అప్పుడప్పుడే తెలుసుకుంటూ ఉంది- ప్రాణం ఉన్నవాటి గురించీ, ప్రాణం లేనివాటి గురించీ! అందుకని ఆ పాప సిద్ధార్థ్ తో అన్నది కదా, "అన్నా! నాన్నకు పుట్టిన రోజు బహుమతిగా మనం ప్రాణం ఉన్న వాటిని ఏమైనా ఇచ్చామనుకో, అప్పుడు అవి కూడా మనతో పాటు పెరుగుతాయి కదా, మనం

పెరిగినట్లే?!" అని.

అన్నకు కూడా చెల్లి ఆలోచన నచ్చింది. "అవును సిరీ! నువ్వు చెప్పింది బాగుంది. ప్రాణం ఉన్న బహుమతి దేన్నైనా వెతుకుదాం ఆగు" అన్నాడు సిద్ధార్థ్.

కొంచెం ఆలోచించాక, "మంచి పూలమొక్కలు కొన్ని తెచ్చి ఇద్దాం, నాన్నకు అవి చాలా నచ్చుతాయి" అనుకున్నారు ఇద్దరూ.

మొక్కలు కొనాలంటే చాలా దూరం వెళ్ళాలి.మరి వాళ్ళిద్దరే వెళ్ళలేరు కదా; అందుకని అమ్మను తోడు తీసుకొని మొక్కలు కొని తేవడానికి బయలుదేరారు. అక్కడ రెండు అందమైన పూల మొక్కలు కొని తెచ్చి వాళ్ళ నాన్నకు కానుకగా ఇచ్చారు.వాళ్ళ నాన్నకు కూడా వాళ్ళిచ్చిన కానుక బాగా నచ్చింది. మీ గుర్తుగా వీటిని బాగా పెంచుకుంటాను అని ఆయన పిల్లలకు మాటిచ్చేశారు. పిల్లలిద్దరూ భలే సంతోషపడ్డారు.

"నాన్న పుట్టినరోజు నాడు కేక్ కూడా చేసిపెడితే బాగుంటుందిరా, అన్నా" అన్నది సిరి. "ఓ, చేద్దాం! కానీ సరుకులు లేవే?!" అన్నది అమ్మ. "నేను తెస్తాగా?" అని, కావలసిన సరుకుల పట్టిక రాసుకొని, అంగడికి బయలుదేరాడు సిద్ధార్థ్. కానీ, ఇంటికి దగ్గరలో ఉన్న అంగళ్ళలో ఆ సరుకులు దొరకలేదు! మరేం చెయ్యాలి?



ఓసారి తను నాన్నతో వెళ్ళాడు- అప్పుడు రోడ్డు అవతల ఉన్న అంగడిలో సామాన్లు కొన్నాడు నాన్న! గుర్తొచ్చింది వాడికి.

కానీ ఆ రోడ్డేమో వచ్చీ పోయే వాహనాలతో బాగా రద్దీగా ఉంటుంది. తను ఒక్కడే రోడ్డు దాటలేడు. 'మరి ఎలాగ?' అని కాసేపు

ఆలోచించాడు వాడు. 'పోనీలే, అక్కడికి వెళ్ళి చూద్దాం, రోడ్డు దాటలేకపోతే వెనక్కి వచ్చేస్తాను. అప్పుడు అమ్మను తీసుకుని మళ్ళీ వెళ్తాను" అనుకొని రోడ్డు దగ్గరికి వెళ్ళాడు.



చూస్తే నిజంగానే రోడ్డు చాలా రద్దీగా ఉంది. వాహనాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి వస్తూ పోతూనే ఉన్నాయి. సిద్ధార్థ్ దాటలేకపోయాడు. 'ఇప్పుడెలా' అని బిక్క మొహం వేసుకుని నిల్చున్నాడు.

అప్పుడే రోడ్డు దాటడానికి ఇంకొకాయన ఎవరో వచ్చారు. బిక్కమొహం వేసుకొని నిల్చున్న సిద్ధార్థ్ ను చూడగానే ఆయనకు పరిస్థితి అర్థం అయ్యింది. చేయి పట్టుకొని రోడ్డు దాటించటమే కాదు; వాడు అంగట్లో సామాన్లు కొనుక్కుని తిరిగి వచ్చే వరకు వేచి ఉండి, వాడిని మళ్ళీ రోడ్డు దాటించి వెళ్ళిపోయారాయన! సిద్ధార్థ్ కు ఆయన చేసిన పని చాలా నచ్చింది. ఆయనకు కృతజ్ఞతలు చెప్పి సంతోషంగా ఇల్లు చేరుకున్నాడు.

ఇంట్లోకి రాగానే సంతోషంగా అరిచాడు-"అమ్మా, ఇప్పుడేం అయ్యిందో తెలుసా? నేను రోడ్డు దాటలేక అక్కడే నిల్చుండిపోతే, ఎవరో తెలీదు- ఒకాయన నా చెయ్యి పట్టుకొని దాటించారమ్మా! నాకు చాలా సంతోషంగా అనిపించింది. 'ఎదుటివారి నుండి ఏమీ ఆశించకుండా సహాయం చేయాలి' అని నువ్వెప్పుడూ చెప్తుంటావే, అది ఇప్పుడు నాకు బాగా అర్థం అయ్యింది. నేను కూడా ఇలాగే ఎవరికైనా సహాయం చేస్తే వాళ్ళు కూడా నాలాగే చాలా సంతోషపడతారు కదమ్మా?!" అన్నాడు.

"అవునురా సిద్ధూ, ఇవాళ్ళ నీకు సాయం

చేసారే, ఆయనకు నువ్వు నోటితో కృతజ్ఞతలు చెప్పావు కదా? మంచిదే; కానీ నీకు సహాయం చేసినవాళ్ళను మర్చిపోకుండా నువ్వు కూడా నీకు చేతనైనంత మందికి తిరిగి సహాయం చెయ్యడమే అసలైన కృతజ్ఞత" అని చెప్పింది అమ్మ చిరునవ్వుతో.

"మీకు తెలీదుగానీ, ఇవాళ్ళ మీరు నాకు రెండు గొప్ప బహుమతులు ఇచ్చారురా!" అని నాన్న సంతోషంగా పిల్లలిద్దర్నీ ఒకేసారి ఎత్తుకున్నాడు!

శ్రద్ధ!

శేఖర్: డిక్షనరీ పట్టుకుని ట్యూషన్‌కు వెళుతున్నావారాజా?

రాజు: కాదు శేఖర్, ఇంగ్లీషు సినిమాకి.

పథ్యం!

డాక్టరు: ఏంటి, వారం రోజులైనా జబ్బు తగ్గలేదా? ఇంతకీ నేనిచ్చిన మందులు సరిగ్గా తింటున్నారా?

పేషంట్: ఇంట్లో చేసినవి తప్ప బయటివి అస్సలు తినొద్దని గట్టిగా మీరే చెప్పారుగా డాక్టర్!!




ఘనకార్యం!

చింటు: అమ్మా! నువ్వు పాతిన మందారం కొమ్మకు వేర్లే రావడం లేదమ్మా!

అమ్మ:నీకెలా తెలుసు చింటూ?

చింటూ: నేను రోజూ, పీకి చూస్తున్నానమ్మా!!




బుక్కయిపోదాం!

టీచరు:బాలూ,ఇంటికెళ్లి ఏం చేస్తావు?

బాలు: ఒక గంట ఆడుకొని, ఆ తర్వాత బుక్ ఓపెన్ చేస్తా టీచర్!

టీచరు:ఏం బుక్కు?

బాలు: ఫేస్ బుక్కు టీచర్!!



వరం

రచన: వియోగి, "మామ్మ కథలు" *సౌజన్యం: ఎవియం*

పావని కష్టాలు అన్నీ ఇన్నీ కావు. చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకొని సవతి తల్లి చేతిలో యమ యాతనలు అనుభవించింది. సవతి తల్లి ఆ పిల్లను ఓ త్రాగుబోతుకు కట్టబెట్టింది. అంతా చేసి తనకు పుట్టిన సంతానమన్నా గొప్పగా ఉన్నారా, అంటే అదీ లేదు- రోగాల పుట్టలై ఇద్దరూ అకాల మృత్యువు పాలయ్యారు. అటుపైన అత్తా-మామల ఆరళ్ళు; భర్త ప్రమాదంలో కాళ్ళు పోగొట్టుకోవటం; జీవచ్ఛవంలా బ్రతుకు ఈడ్వవలసి రావటం- పాపం, అన్నీ కష్టాలే ఆమెకు!

చివరికి ఆమెకు జీవితం అంటేనే విరక్తి పుట్టింది. ఆత్మహత్య చేసుకుందామని దగ్గరలో ఉన్న అడవిలోకి వెళ్ళింది. అక్కడ ఓ మర్రి చెట్టు క్రిందికి చేరుకోగానే చెట్టు పైనుండి బ్రహ్మరాక్షసుడొకడు ఆమె ముందుకి

దూకాడు.

"పావనీ, ఆత్మహత్య మహా పాపం! దాని వల్ల ఇప్పటి కష్టాలు తీరటంకాదు; బాధలు రెట్టింపు అవుతాయి. నాలాగా ఏ చెట్టుమీదో, పుట్టమీదో తిరుగుతూ అనేక తరాలపాటు కృంగి కృశిస్తూ తిరగాల్సి వస్తుంది" అని రకరకాలుగా బుజ్జగించి చెప్పాడు.

"ఇన్ని తెలిసినవాడివి, ఇలా అయ్యావేం?" అని అడిగింది పావని, కొంచెం తేరుకొని.

"ఏం చెప్పను? ఒకప్పుడు నేను గొప్ప శివభక్తుడిని- కానీ ఒట్టి కోపిష్టి వాడిని. ఆ కోపంలో ఎంతో మందిని నాశనం చేశాను. చివరికి అందరూ నాకు ఎదురు తిరిగారు; నా ఆస్తులన్నిటినీ లాక్కున్నారు. నా భార్యాపిల్లలు నన్ను విడచి పెట్టేశారు. తినేందుకు ఏమీలేక, రోగాల పాలై, చివరికి వాటినుండి తప్పించుకుందామని, ఆత్మహత్య చేసుకు-న్నాను. ఇలా తయారయ్యాను" చెప్పాడు వాడు.

వాడి కథ వినేసరికి పావనికి వాడి మీద జాలి వేసింది. "నీ కథ వింటే ఇక ఎవ్వరూ ఆత్మహత్య చేసుకోరు. నేనూ తిరిగి ఇంటికి వెళ్ళి పోతానులే, ఇప్పటికి అయ్యింది చాలు" అన్నది విచారంగా.

మరుక్షణం ఆ బ్రహ్మరాక్షసుడికి దివ్య శరీరం వచ్చేసింది. "నిన్ను ఆత్మహత్య చేసుకోకుండా ఆపాను చూడు, అ పుణ్యం వల్ల నా కష్టాలు తీరిపోయాయి. రాక్షస రూపం నుండి నాకు విముక్తి లభించింది" అని చెప్పి పావనికి ఓ మంత్రం ఉపదేశించాడు ఆ దివ్యపురుషుడు- "దీన్ని జపించు, అంతా మేలు జరుగుతుంది" అని చెబుతూ.

పావని శ్రద్ధగా ఆ మంత్రం జపించే సరికి, పార్వతీ పరమేశ్వరులు ఆమె ముందు ప్రత్యక్షం అయ్యారు: "ఏం వరం కావాలో కోరుకో" అంటూ.

పావనికి తను ఇంతకాలమూ పడ్డ కష్టాలు-కన్నీళ్ళు, బాధలు అన్నీ గుర్తుకొచ్చాయి. "దేవాధిదేవా! ఈ లోకంలో ఎవరికీ కష్టాలు-బాధలు లేకుండా చెయ్యి స్వామీ!" అంటూ కన్నీళ్ళు కార్చింది.

శివుడు నిర్ఘాంత పోయాడు. "అసాధ్యం!

అలవికాని కోరికలు కోరకు, పావనీ! నీకు ఒక్కదానికీ ఏం కావాలో చెప్పు" అన్నాడు.

"కేవలం నా ఒక్కదానికోసం ఏమీ కోరుకోలేను స్వామీ! ప్రపంచంలో ఎవ్వరికీ ఏలాంటి బాధలూ లేకుండా వరం ఇవ్వండి - నా కోరిక అదే" అన్నది పావని.

"ఇది సృష్టికి వ్యతిరేకం- నేను ఇవ్వలేను" అన్నాడు శివుడు. "వేరే ఏదైనా కోరుకో, పావనీ" అన్నది పార్వతీదేవి.

"తల్లీ నా కోరిక అదొక్కటే, నేనేం చెయ్యను?" అంది పావని.

"పాపం, ఆడపిల్ల, అడుగుతోంది, ఆమె కోరుకున్న వరమే ఏదో ఇచ్చేస్తే పోలేదా, అట్లా కఠినంగా మాట్లాడతారెందుకు?" భర్తతో నెమ్మదిగా చెప్పింది పార్వతమ్మ.

"లేదు పార్వతీ! మనుషులు గతంలో చేసిన పనులవల్లనే వాళ్లకు కష్టాలుగాని, సుఖాలుగాని కలుగుతుంటాయి. ఆ కర్మ చక్రంలో నా వంటివాళ్ళు జోక్యం చేసుకోకూడదు; చేసుకోను" అన్నాడు శివుడు.

"నీ కోరికను మార్చుకోమ్మా!" పావనికి చెప్పింది పార్వతమ్మ.

"లేదమ్మా! నా కోరికలో మార్పులేదు. ఈ లోకంలో కష్టాలతోటీ, బాధలతోటీ ఎవ్వరూ నశించకూడదు" అన్నది పావని.

పార్వతి నవ్వుతూ చూసింది భర్తకేసి. శివుడు కలవరపడ్డాడు- అంతలోనే ఓ మంచి ఆలోచన తట్టిందాయనకు-

"సరే, అలాగే కానియ్యి, పావనీ! నీ కోరిక ప్రకారమే మానవుడికి మతిమరపు ప్రసాదిస్తున్నాను. ఎన్ని కష్టాలున్నా, ఎన్ని బాధలున్నా ఒక్క సారి మంచి నిద్రపోయి లేస్తే చాలు- తన బాధలన్నిటినీ మరచిపోగల్గుతాడు మనిషి" అంటూ సతీ సమేతంగా మాయమైపోయాడు.

అంతే! అప్పటినుండి మానవుడు ఎన్ని బాధలున్నా మరచిపోయి హాయిగా నవ్వుతూ జీవిస్తున్నాడు. మరపు మానవుడికి నేస్తంగా వచ్చి చేరుకున్నది మరి!



సీత-భూతం

నేపాలీ జానపద కథ

స్వేచ్ఛానువాదం: నారాయణ

అనగా అనగా ఓ అడవి అంచున ఒక ఊరు ఉండేది. ఆ ఊళ్ళో చంద్రదీప్ అనే మేదరి ఒకడు ఉండేవాడు . అతని భార్య సీత చాలా తెలివైనదీ, మంచిదీనీ.

చంద్రదీప్ ప్రతిరోజూ ప్రొద్దునే బయలుదేరి అడవికి వెళ్ళేవాడు. ఆ రోజుకు అవసరమైనన్ని వెదుర్లు మటుకు కొట్టుకొని తెచ్చుకునేవాడు. అడవి బాగా దట్టంగా ఉండేది కదా, లోపల రకరకాల క్రూరమృగాలు నివసించేవి. అందుకని అందరూ అడవిలోపలికి పోయేందుకు జంకేవాళ్ళు. సాధారణంగా చంద్రదీప్‌కి కావలసిన వెదుర్లు అడవిలో ఎక్కువ లోపలికి పోకుండానే సులభంగా దొరికేవి. అందువల్ల పెద్ద సమస్యగా ఏమీ ఉండేది కాదు.

అయితే ఒక రోజున అతనికి సన్నగా ఉండే

ప్రత్యేకమైన వెదురు కావలసి వచ్చింది. అది అడవిలోపల మాత్రమే దొరికే రకం. అందుకని వాటికోసం చంద్రదీప్ ఉదయాన్నే బయలుదేరి అడవిలోపలికల్లా పోయాడు. అయితే అతనికి ఆ వెదురు అంత సులభంగా దొరకలేదు.. మెల్లగా చీకటి కూడా పడసాగింది.

చంద్రదీప్ ఇక వెనక్కి తిరిగి వచ్చేద్దామనుకున్నాడుగానీ, అతని పాదాలు ఎందుకనో అతన్ని ముందుకే తీసుకెళ్ళాయి. అడవిలోని ఆ ప్రాంతంలో చెట్లు మరీ దట్టంగా పరచుకొని ఉన్నాయి. తనకు భయం వేసినప్పుడల్లా చంద్రదీప్ తనకు దొరకనున్న సన్నటి వెదురును గుర్తు చేసుకొని ధైర్యం తెచ్చుకుంటున్నాడు.

చివరికి అతనికి తను వెతుకుతున్న వెదురుపొద ఒకటి కనబడింది. దాన్ని చూడగానే చంద్రదీప్‌కు ప్రాణం లేచి వచ్చినట్లయింది. అతను గబగబా వెళ్ళి దాన్ని నరికేందుకు కత్తి ఎత్తాడు- అంతలోనే అతని వెనక ఏదో అలికిడి అయ్యింది. చంద్రదీప్ గబుక్కున వెనక్కి తిరిగాడు; కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది. అక్కడ నివసిస్తున్న భూతం ఒకటి అతన్ని పట్టుకొని, వంచి నేలమీద పడుకోబెట్టేసింది. మరుక్షణంలో అతను స్పృహ కోల్పోయాడు!



ఆ భూతం చాలా కాలంగా మనుషుల్ని పట్టుకోవటం కోసమే వేచి ఉన్నది. దానికి నరమాంసం అంటే చాలా ఇష్టం. అయితే, దాని తత్వం పిల్లి మాదిరిదే- చడీ చప్పుడు లేకుండా తన వేటని తినటం దానికి ఇష్టం లేదు. తినేముందు కొంచెం ఏడుపూ, హడావిడీ, రొదా, గందరగోళమూ లేకపోతే దానికి అసలు తిన్నట్టుండదు. అందుకని, ఏం చేద్దామా అని అది కొంచెంసేపు ఆలోచించింది. ఆ పైన వెంటనే తన రూపం

మార్చుకొని, అచ్చం చంద్రదీప్‌లా తయారైంది!

ఒకసారి అట్లా రూపం మార్చుకోగానే దానికి చాలా ఉత్సాహం వచ్చింది. అది నిజం చంద్రదీప్‌ని అట్లాగే నేలమీద వదిలి, ఈ వేషంలో ఊళ్ళోకి బయలుదేరింది. అదృష్టం బాగుంటే ఈ వేషంలో తనకు సాయంత్రంకల్లా మరింతమంది మనుషులు దొరికే వీలుంది!



అది మెల్లగా నడచుకుంటూ చంద్రదీప్ వాళ్ల ఇల్లు చేరుకునే సరికి సాయంత్రం కావొస్తున్నది. అతని భార్య సీత వంటగదిలో అన్నం వండుతున్నది. అక్కడినుండి వెలువడుతున్న ఘుమఘుమలకు మామూలుగా ఎవరి నోరైనా ఊరాల్సిందే. భూతానికి కూడా నోరు ఊరింది. అయితే దాని నోరు ఊరేందుకు కారణం వేరు: చంద్రదీప్ భార్య సీత, పిల్లలు చాలా చక్కని వాసన వచ్చారు, దానికి! సాయంత్రం కొంచెం చీకటి పడ్తుండగా అది వీళ్లనందరినీ తినేయనున్నది!

అయితే చంద్రదీప్ భార్య సీత మటుకు అతని ప్రవర్తనలో తేడాని ఏమాత్రం గుర్తించలేదు. "ఏది, వెదురు తేలేదా?" అని ఆమె అడిగితే అతను ఊరికే నవ్వాడు తప్పిస్తే ఇంకేమీ మాట్లాడలేదు. ఇంకా చీకటి పడకనే ఆమె అందరికీ అన్నం వడ్డించింది. భూతం కూడా అన్నం తినేసింది. ఆ తర్వాత దానికి కంటినిండా నిద్రవచ్చేసింది. పొయ్యికి దగ్గరలోనే వెచ్చగా పడుకొని, అది తన కాళ్ళకు నూనె రాయమని సీతను ఆజ్ఞాపించింది. అంతలోనే దానికి కునుకు పట్టేసింది.

సీత నూనె తీసుకొనివచ్చేసరికి చంద్రదీప్ రూపంలోని భూతం గురకపెట్టి నిద్రపోతున్నది. ఆమె అతని కాళ్ల దగ్గర కూర్చొని నూనె రాయబోతూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డది: ఇవి

తన భర్త కాళ్ళు కాదు! బయటినుండి చూసేందుకు భూతం అచ్చం చంద్రదీప్ లాగా తయారైంది; కానీ దుస్తుల లోపల మటుకు దాని శరీరంలో ఏ మార్పూ లేదు!



దాంతో ఒక్కసారిగా సీతకు వణుకు వచ్చినట్లయింది. ఇది తన భర్త కాదు- భర్త వేషంలోవచ్చిన ఏదో భూతం! అయినా ఆమె క్షణంలో తెప్పరిల్లి, ఏం చేయాలో ఆలోచించింది. ముందుగా పిల్లల్ని లేపి, "చప్పుడు చేయకండి, రండి!" అని సైగలు చేసి, వాళ్లను దూరంగా తీసుకెళ్ళి కూర్చోబెట్టింది. అటుపైన వెనక్కి తిరిగి వచ్చి, అంతకు ముందు వాళ్ళు పడుకున్న చోట దిండు ముక్కలు పెట్టి, వాటికి దుప్పటి కప్పేసింది. ఆ తర్వాత వంట ఇంట్లోంచి రెండు దోసిళ్ల బఠానీలు తెచ్చి, వాటిని ఇల్లంతా చల్లింది. తర్వాత కణకణా మండుతున్న బొగ్గులు తీసుకొచ్చి వంటగది వాకిలికి ప్రక్కగా పోసి, అవి కనబడకుండా వాటి మీద ఓ ఇనప పెనం పెట్టింది. ఈ పనులన్నీ చెయ్యగానే పిల్లలతో కలిసి ఇంట్లోంచి దూరంగా వెళ్ళిపోయి, ఏం జరుగుతోందో గమనించసాగింది.

బాగా రాత్రయ్యాక భూతానికి మెలకువ వచ్చింది. మేలుకోగానే దానికి నరమాంసం గుర్తుకు వచ్చింది. సీత-పిల్లలు తన ప్రక్కనే ఉన్నారనుకొని, అది గబుక్కున దిండ్లలోకి గోర్లను గుచ్చింది. తీరా చూస్తే అక్కడ ఉన్నవి ఒట్టి దిండ్లే! తను మోసపోయానని గుర్తించగానే, దానికి ఎక్కడలేని ఆవేశం వచ్చింది. ఒక్క ఉదుటన లేచి ముందుకు దూకబోయిన భూతం నేలమీద ఉన్న బఠానీలమీద కాలు వెయ్యగానే ఒక్కసారిగా జారింది. దభాలున క్రింద పడబోతూ, దాన్ని ఆపుకునే క్రమంలో మరింత గందర గోళపడి,

రెండు పల్టీలు కొట్టి, నేరుగా పెనం క్రింద పెట్టిన నిప్పుల్లో పడింది. ఆ రకం భూతాలకు నిప్పు సరిపోదు- నిప్పుని ముట్టుకోగానే అది కాస్తా తన సొంత రూపాన్ని పొంది, చచ్చిపోయింది!



బయటినుండి దాన్ని గమనిస్తున్న సీత ఇప్పుడు తృప్తిగా ఊపిరి పీల్చుకొన్నది. పిల్లలూ, తనూ లోపలికి వచ్చి ఆ భూతపు శరీరాన్ని ఏం చెయ్యాలా అని ఆలోచించారు. దాన్ని అట్లా ఇంట్లో వదిలేసేందుకు వీలులేదు! సీత దగ్గర తను పుట్టింటినుండి తీసుకు వచ్చిన ఇనప భోషాణం ఒకటి ఉండేది. దానిలో అంత విలువైనవస్తువులేవీ లేవుగానీ, చూసేందుకు మటుకు అది గొప్పగా ఉండేది. ఇప్పుడు వీళ్ళు దాన్ని భూతం శరీరం దగ్గరికి లాక్కొచ్చి, అతి కష్టం మీద భూతం శరీరాన్ని దానిలోకి నెట్టి మూత వేసేశారు.

ఒక సారి ఆ పనయ్యాక, సీతకు చంద్రదీప్ గుర్తుకొచ్చాడు. భర్త ఏమయ్యాడోనని ఆందోళన మొదలైంది ఆమెకు. ఈ భూతం అతన్ని తినెయ్యలేదు గద, లేకపోతే అతని పోలికలు ఎలావచ్చాయి, దీనికి?!

వెంటనే ఆమె పిల్లల్ని వెంటబెట్టుకొని, చేతిలో ఓ లాంతరు పట్టుకొని, ఆ రాత్రి వేళనే అడవిలోకి బయలుదేరింది. సీత చాలా ధైర్యం గలది. అంతేకాక ఆమెకు అడవంతా కొట్టిన పిండి. నేరుగా ఆమె అడవి మధ్యలో సన్నటి వెదుళ్ళు ఉన్న పొద దగ్గరికి వెళ్ళేసరికి, అక్కడ నేలమీద పడి ఉన్న భర్త కనిపించాడు. ఆమె గబుక్కున వంగి చూసింది. చూడగా అతని శ్వాస ఇంకా ఆడుతూనే ఉన్నది. ఆమె తన చీర చెంగుతో భర్త ముఖం తుడిచి, అతన్ని మూడుసార్లు కొట్టేసరికి చంద్రదీప్ టక్కున తేరుకొని, లేచి కూర్చున్నాడు-"నా కొడవలి ఏది, వెదుళ్ళు కొట్టాలి" అంటూ.

"చాల్లే, ఇప్పటికే చీకటి పడింది- పోదాం పద"

అని, భర్త చెయ్యి పట్టుకొని లేవదీసింది సీత. అందరూకలిసి అడవి దాటి తెల్లవారు జాముకల్లా భద్రంగా ఇల్లు చేరుకున్నారు. ఇంటి పరిస్థితిని చూసి సీత నిర్ఘాంత పోయింది. మధ్య గదిలో తాము వదిలి వచ్చిన భోషాణం అదృశ్యం అయ్యింది!



నిజానికి జరిగిందేంటంటే, ఆ రోజున ఇంట్లో ఎవ్వరూ లేకపోవటం చూసి, నలుగురు దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. మధ్య గదిలో వాళ్లకోసమే పెట్టినట్లున్న భోషాణాన్ని చూసే సరికి వాళ్లకు ఎక్కడలేని సంతోషం కలిగింది. దాన్ని ఎత్తి చూసుకొని,"బరువుగా కూడాఉందిరా!" అని మురిసిపోయారు వాళ్ళు.

అంతలో దూరంగా ఏదో అలికిడి అయినట్లనిపించి, వాళ్ళు నలుగురూ కూడబలుక్కున్నట్లు ఆ భోషాణాన్ని ఎత్తుకొని ఆయాసపడుతూనే గబగబా చాలా దూరం పోయారు. అక్కడ వాళ్ళు మూత తెరిచి చూసుకుంటే ఏముంది, కొమ్ములూ, కోరలూ పెట్టుకున్న పెద్ద భూతం బయటపడ్డది!

ఆ దెబ్బకు వాళ్ళలో ఒకడు అక్కడే మూర్ఛపోయాడు; మిగతా వాళ్లంతా తలొక దిక్కుకూ పరుగు తీశారు. తర్వాత కొత్వాలు మనుషులకు మూర్ఛపోయినవాడూ, వాడిద్వారా మిగిలినవాళ్లూ అందరూ చిక్కారు. భూతం బెడద వదిలించటమే కాక, దొంగల్ని కూడా పట్టించినందుకు సీతకు రెట్టింపు సన్మానాలు చేశారు ఊళ్ళోవాళ్ళు!

చిలిపి ప్రశ్నలు

నిర్వహణ: శ్రీవి.వి.యస్. మూర్తి, చొదిమెళ్ళ, ప.గో. జిల్లా

1. అత్యాశ..?



టికెట్లు కొనకుండా లాటరీ రావాలని ఆశపడటం!

2. ఇంగ్లీషులో బటర్ అంటే వెన్న. ఫ్లయ్ అంటే ఈగ. మరి బటర్‌ఫ్లయ్ అంటే?

వెన్న మీద వాలే ఈగ!

3. విమానాశ్రయందగ్గర బిచ్చగాడు ఏమని అడుక్కున్నాడు?



ఒక డాలర్ ధర్మం చేయండి బాబూ!

4. ప్రాణంలేకపోయినా కరిచేది ఎవరు?

చెప్పు!

5. డ్రైక్లీనింగ్ అంటే..?




నీళ్ళు లేకుండానే ఉత్తుత్తిగా బట్టలు ఉతకటం!

6. వార్తలు వినే అలవాటున్న టీచరు, క్లాసు ముగించే ముందు ఏమంటుంది?

ముఖ్యాంశాలు మరోసారి!

7. ఎండమావి అంటేఏంటి?



ఎండలో ఉన్న మామిడి చెట్టు!

8. పుస్తకానికి, టీవీకీ తేడా ఏంటి?

పుస్తకం మన దగ్గరికి వస్తుంది; మనం టివి దగ్గరికి వెళ్తాం!

సమంతా షానన్

యువకెరటాలు

నిర్వహణ: సౌమ్య, పుస్తకం.నెట్



ఇరవైరెండేళ్ళ రచయిత్రి సమంతా షానన్ గురించి పత్రికల్లో చదివాను ఈమధ్యే. ఆమె ఒక ప్రముఖ ప్రచురణ సంస్థతో ఏడు నవలలు రాయడానికి ఒప్పందం కుదుర్చుకోవడంతో చాలా పేరు తెచ్చుకుంది. పత్రికల్లో ఆమెని హ్యారీ పోటర్ నవలా రచయిత్రితో పోల్చడం కూడా కనబడ్డది. ఆమె గురించి, ఆమె తొలి పుస్తకం అచ్చవడం గురించి ఈ వ్యాసం.

1991 లో పుట్టిన షానన్ బ్రిటన్ దేశస్థురాలు. అక్కడే పుట్టి పెరిగింది. ఇటీవలే ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయం నుండి ఆంగ్ల సాహిత్యంలో డిగ్రీని పొందింది. 15 ఏళ్ల వయసులో మొదటిసారి 'అరోరా' అన్న నవల రాసింది. అది ప్రచురింపబడలేదు; కానీ ఆమెలో ఆ ఆసక్తి అలాగే ఉండింది. తరువాత 19 ఏళ్ళ వయసులో మళ్ళీ మరొక నవల రాసింది. పగలు కాలేజీకి వెళ్తూ, రాత్రుళ్ళు నవల మీద పనిచేస్తూ, నెలల తరబడి రాసింది. 'ఈసారి దీన్ని పుస్తకంగా చూడాలి' అనుకుంది.

కానీ, నవలల్ని ప్రచురించటం ఏమంత సులభమైన విషయం కాదు. 'ఎక్కే గడప-దిగే గడప' అన్నట్లు, చాలా మంది ప్రచురణకర్తల చుట్టూ తిరిగింది షానన్. ఎట్టకేలకు, ప్రముఖ ప్రచురణ సంస్థ 'బ్లూంస్బరీ' సమంతాతో ఏడు నవలల కాంట్రాక్టుకు ఒప్పుకుంది! అంటే, ఈ అమ్మాయి భవిష్యత్తులో రాయబోయే ఏడు నవలలను ఆ సంస్థే ప్రచురిస్తుంది, మార్కెట్ చేస్తుంది అన్నమాట. ఆ నవలలమీద వచ్చే లాభాలుగానీ, నష్టాలు గానీ అన్నీ ఆ సంస్థవే! ఆ కాంట్రాక్టును అనుసరించి ఆమె రాసిన మొదటి నవల "ది బోన్ సీజన్" ఇట్లా వెలువడిందో లేదో, చాలామంది దాన్ని కొన్నారట, చదివి మెచ్చుకున్నారట. భారత దేశంతో సహా మరో 20 దేశాల్లో ఈ నవల హక్కులు కొనుగోలు చేశారనీ, సినిమా హక్కులు కూడా కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నారనీ పత్రికల్లో రాశారు. మొత్తానికి బ్లూంస్బరీ సంస్థకు మంచి

లాభమే రావచ్చు.

ఈ నవలలో కథ ఏంటి? 2059 లో-లండన్‌నగరంలో-కథానాయకురాలు పందొమ్మిదేళ్ళ ఐరిష్ యువతికి- జరగబోయే విషయాలన్నీ ముందే తెలుస్తూ ఉంటాయి. (ఇట్లా మనకూ జరిగితే?!) అయితే ఇట్లా ముందుగా తెలీటం వల్ల ఆమెజీవితంలో ఎంతో గందరగోళం, మార్పులు వచ్చేస్తాయి. అదన్నమాట ఈ కథ. వాస్తవికతనూ, కాల్పనికతనూ ఆమె కథలో బలే తెలివిగా కలిపిందనీ, పాతకాలం నాటి ప్రముఖ ఆంగ్ల నవలాకారుల శైలిని గుర్తుచేసిందనీ, బ్లూంస్బరీ సంస్థ ప్రధానసంపాదకులు ఓ ఇంటర్వ్యూలో సమంతాను మెచ్చుకున్నారు.

ఈ నవల "ది బోన్ సీజన్" గురించి చెబుతూ సమంతా అన్నది:"నేను కథల గురించి ఆలోచించని క్షణం అంటూ అసలు లేనే లేదు. 'ది బోన్ సీజన్'లో ఉన్నదాంట్లో 90 శాతం నా మెదడే. మిగిలిన పది శాతం బయటి ప్రపంచంతో దానికున్న సంబంధం " అని. మరి మనలోనూ చక్కర్లు కొడుతున్నాయిగా, లెక్కలేనన్ని కథలు? మనం కూడా చెయ్యాల్సింది, సమంతాలాగే వాటిని కాయితం మీద పెట్టటం. ఆ తర్వాత వాటిని వేరేవాళ్ళెవరైనా ప్రచురిస్తారో, మనమే సొంతగా ప్రచురించుకుంటామో మన ఇష్టం. ఏమంటారు? రాయటం మొదలు పెట్టెయ్యండి ఇక!

సమీక్ష

కొత్తపల్లి కథల పుస్తకం-63 పై ఒక సమీక్ష
సమీక్షకులు: శ్రీ రాజా పిడూరి.



ఆగష్టు సంచిక ముఖ చిత్రం మీద భారత దేశ పతాకానికి శాల్యూట్ చేస్తున్న పిల్లలను చూడగానే కొంచెం బాధ కలిగినా (పెరిగిన తలలతో, పుల్లల్లాంటి కాళ్ళూ చేతులతో, కొద్దిగా మాసినట్లున్న బట్టలతో), వీళ్ళే కదా ఎక్కువ మంది పిల్లలకీ, భారత దేశపు గ్రామీణ సమాజానికి నిజమైన ప్రతినిధులు అనిపించింది.

కుందేలు బొమ్మకు వ్రాసిన కథ (వీరనరేశ్ కథ - సాయిక్రిష్ణ) కూడా స్వాతంత్ర్య దినోత్సవ సందర్భానికి చక్కగా సరిపోయింది. కుందేళ్ళ రాజ్యానికి "కుందేకొండ" అని పేరు పెట్టడం కూడా ఎంతో బాగుంది. పేర్ల తోనే నడిపించి, బాగా చదివించిన ఇంకో కథ హర్షవర్ధన రెడ్డి వ్రాసిన "తిండిపోతు చెప్పిన కథ". ఉల్లిపాయంత ఊళ్ళో ఉన్న దొండకాయంత దొంగ, బీరకాయంత బీరువా, వంకాయంత వజ్రం అని చెప్పుకునే చిన్నప్పటి కథని గుర్తుకి తెస్తూ (కానీ ఆ పాత పోలికలు ఏవీ వాడకుండా) చాలా కొత్తగా ఉండి బాగా చదివించింది. మొద్దు నిద్ర పోతున్న దధ్యోజనం, జంతికల పడవలు, చింత పులుసంత చింతాక్రాంతం, అప్పడం మీద డప్పు కొట్టించడం, దోసెల వల వెయ్యడం - భలే నవ్వించాయి.

ఈ నెలలో స్వాతంత్ర్యం గురించిన కథలు ఎక్కువ లేకపోయినా, సంపాదకీయంలో ఎంతో ముఖ్యమని చెప్పిన సంస్కృతి, చరిత్రకి సంబంధించిన జానపద కథలు నాలుగు ఉండడం విశేషం. వంట పాత్రలనే 'పాత్రలు' గా చేసి దొంగల బారి నించి తప్పించుకున్న తెలివైన ముసలమ్మ కథ (నేపాలీ జానపద కథ)లో

చివరలో దొంగలు వదిలి వెళ్ళిన దానిని తీసుకుంటూ వంట పాత్రల తో ఆ సంతోషాన్ని పంచుకోవడం, ఆ తరవాత పనికి, తోడుకి మనుషుల్ని ఇంట్లో పెట్టుకోవడం బాగున్నాయి. "కోతి మనసు" కోతిని ఎలా నాశనం చేసిందో రాయల సీమ జానపద కథ చెపితే (కోతి మనసు తెచ్చిన తంటా - వెంకట సాయి), బౌద్ధ కథ (జెన్‌సన్యాసి - పులి) ధ్యానంలో కుదురుకున్న మనసు యొక్క శక్తిని ఎంతో చక్కగా చెప్పింది. 'చక్రి' కథనంలో భారత దేశపు జానపద కథ ('తూర్పు దేశంతో వ్యాపారం') కొంచెం పెద్ద కథ అనిపించినా బాగానే చదివించింది.

ఈ అన్ని కథలకీ చక్కగా కుదిరిన ఇంకో విశేషం బొమ్మలు. వీటికి వేసిన బొమ్మలన్నీ ఎంతో బాగున్నాయి.

జానపదకథ అని చెప్పక పోయినా అలానే అనిపించిన ఇంకొక కథ మాయమంత్రాల కథ (బాల మణికంఠ). ఈ కథకి కూడా బొమ్మలు బాగున్నాయి. బొమ్మల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన ఇంకొక కథ సమయస్ఫూర్తి. కొత్తగా ఉన్న ఈ కథలో సైక్లిష్టుల వెనక ఉన్న జనసమూహాలు చిన్న చిన్న చుక్కలతో గీతలతో ఎంతో చక్కగా కుదిరాయి. 'నీతి చంద్రిక'కి వేస్తున్న బొమ్మలు మాత్రం తేలిపోతున్నాయి అనిపిస్తోంది ప్రతి నెలా. చిట్టి పాటా, దానికి వేసిన బొమ్మా రెండూ బాగున్నాయి.

దయ్యాల కథ లేకుండా పోతుందేమో అన్న లోటుని తీర్చింది వేణుగోపాల్ వ్రాసిన 'భయం' కథ. లలిత గారు వ్రాసిన 'వజ్రపుటుంగరం' కథ ఎన్నో ఆసక్తికరమైన మలుపులతో వేగంగా సాగింది. కానీ పేరు "వజ్రాలహారం" అనో "రాణీ గారి నగలు" అనో ఉండాలేమో..

ఇష్టమైనవి చేస్తుంటే, కష్టమైన పనులు కూడా అంత కష్టమనిపించవని చెప్పిన కథ జాహ్నవి వ్రాసిన 'సంగీతం'. యువ కెరటాలు లో 'కెల్విన్ డో' గురించి (పశ్చిమ ఆఫ్రికా లోని చిన్న దేశం సియర్రా లియోన్ కి చెందిన యువ మేధావి) సౌమ్య గారు చెప్పిన విధానం ఎంతో స్ఫూర్తి దాయకం గా ఉంది. చివరి అట్ట మీద సంభాషణలో చెప్పినట్లు అయస్కాంతం కోసం బండి స్పీకర్లని విప్పేసే పిల్లల్నీ, లోపల బల్బు ఎలా వెలుగుతోందో చూద్దామని రోబాట్ బొమ్మని విరిచి ముక్కలు చేసి పెట్టే "నిలకడ లేని పిల్లల్ని" అట్లాగే స్వేచ్ఛగా, సంతోషంగా ఎదగనిస్తే కొంతమంది కెల్విన్ డో లైనా దొరుకుతారేమో మనకి !

మంచి పుస్తకం:



స్వామి-మిత్రులు

మూలం: ఆర్.కె.నారాయణ్ *అనువాదం: డా. వాసిరెడ్డి సీతాదేవి*

స్వామి వాళ్ళ ఊరు పేరు మాల్గుడి. తమిళనాడు రాష్ట్రం. వాడికి పదేళ్ళు. స్వామి, వాడి స్నేహితులు మామూలు వాళ్ళు కారు. బడి, బొమ్మ, అల్లరి, క్రికెట్, ఈత, అడవిలో తిరగటం, పశువులతో ఆట, పోలీసులు, దొంగలు, ఈలలు వేయటాలు... ఒకటేమిటి, అన్నిటిలోనూ వాళ్ళకు వాళ్ళే సాటి.

ఆర్.కె.నారాయణ్ శైలి నిజంగా ఓ అద్భుతమే. సున్నితమైన హాస్యం, ఒకింత చిలిపిదనం, మహా గొప్ప కథనం- అన్నిటినీ మించి, మామూలు ప్రపంచంలోనే పోతపోసుకున్నట్లుండి కూడా ఊహకందని మలుపులుండే కథలు ఆయన సొంతం. మరి స్వామి కథల్లో అవన్నీ లేకపోతే ఎలాగ? అన్నీ ఉన్నై!

వాసిరెడ్డి సీతాదేవి గారి అనువాదంలో కొంచెం పాత వాసన వస్తుంది. ఈ సరికే పుస్తకాల పిచ్చిలో పడిపోయి దొరికిన పుస్తకాన్నల్లా చదివేస్తున్న పిల్లలకు మటుకు అది అర్థం అవుతుంది; నచ్చుతుంది కూడాను.

ఆంగ్లంలోవచ్చిన గొప్ప పుస్తకాలను చాలావాటిని తెలుగు పిల్లలకు పరిచయం చేసి గొప్ప పుణ్యం కట్టుకున్న యన్.బి.టి వారు తక్కువ ధరకు ప్రచురించిన మరో మాణిక్యం ఇది.

స్వామి-మిత్రులు ప్రచురణ: యన్.బి.టి(1996) వెల: 29 రు. పేజీలు:180

కృతజ్ఞతలు: 'ఇంక చాల్లే' అని చతికిలపడిపోయిన సమయంలో స్ఫూర్తినిచ్చి, 50,000 రూపాయలు సాయం చేసి ఈ పుస్తకం వెలువడేందుకు కారణమైన కందిమళ్ళ శివశంకర్ గారికి, రాధ-రాజశేఖర్ గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు. 'ఏం కావాలి?' అని, అడగకనే సాయపడ్డ మిత్రులు- కీస్టోన్ ఇన్ఫ్రా రమేష్‌గారికి, శ్రీ పూదూరి రాజిరెడ్డి గారికి, నాగార్జున గారికి, శ్రీమతి పాండాదాస్ గారికి, పిడూరి కృష్ణమూర్తి గారికి, బృంద గారికి, నాలుగు నెలలపాటు ఓపికతో వేచి చూసిన చందాదారులకు, శ్రేయోభిలాషులకు వేనవేల నెనర్లు.

పిల్లల్లో సృజనాత్మకత సహజం. కథలు, ఆటలు, పాటలు, బొమ్మలు దానికి ఊతాన్నిస్తాయి. మాతృభాషలో ఇష్టంగా చదవటం, తేలికగా రాయటం వస్తే అటుపైన అన్ని శాస్త్రాలూ సులభంగా వంటపట్టుతాయి-నిజం! అందుకని మీ పిల్లల్లో ఉన్న కాల్పనిక శక్తికి పదును పెట్టండి. వాళ్లను కథలు రాసేందుకు, పాటలు పాడేందుకు, బొమ్మలు వేసేందుకు ప్రోత్సహించండి. వాళ్ళ రచనల్ని మాకు పంపండి. కావాలనిపిస్తే మీరే ఇలాంటి పత్రికనొకదాన్ని మొదలు పెట్టండి- ఎలాగైనా సరే- పిల్లలు పెద్దవాళ్లయ్యేలోగా వాళ్ళు చాలా చాలా తెలుగు కథల్ని చదివేలా, రాసేలా చేయండి. మీ పిల్లలకు ఈ పత్రికలోని కథలు నచ్చుతాయనే మా నమ్మకం- వీటిని వీలైనంత మందితో పంచుకోండి. మీరు రాసిన పిల్లల కథలు ఏమైనా ఉంటే పనిగట్టుకునైనా సరే, మాకు పంపండి. వీలు చేసుకొని ప్రచురిస్తాం.

ఫస్టు ర్యాంకు

"మావాడికి ఎప్పుడూ ఫస్టుర్యాంకే వస్తుంటుంది" చెప్పింది మణిమాలమ్మ సంతోషంగా.

"అవునా! అయితే బాగా చదువుతాడన్నమాట వీడు!" మురిపెంగా అంటూ నానిగాడిని దగ్గరికి తీసుకున్నాను నేను.

మణిమాలమ్మ అన్నది- "ఎప్పుడూ ఏదేదో చెబుతూనే ఉంటాడు. నేనేమో ఇంగ్లీషు చదువుకోలేదుగా, అందుకని ఏమీ అర్థం అవ్వదు నాకు!" అని.

"ఎన్నో క్లాసురా, నువ్వు?" అడిగాను.

"యు కె జి!" అన్నాడు నానిగాడు ముద్దు ముద్దుగా.

"బాగుంది బాగుంది. మరి నీకు 'అ ఆ ఇ ఈ'లు వచ్చా?" అడిగా.

"రావు!" అన్నాడు నాని గొప్పగా, తల అడ్డంగా ఊపుతూ.

"ఓహో! మరి ఎబిసిడిలు వచ్చే ఉంటాయి- చెప్పు" అన్నాను.

"గడ గడ గడ..." చెప్పేసి గాలి పీల్చుకున్నాడు వాడు.

"భలే!భలే!" మెచ్చుకున్నాను. "ఇంకా ఏమొచ్చురా, నీకు? మీకు రోజూ ప్రార్థన ఉంటుందా, మార్నింగ్ అసెంబ్లీ?" అడిగాను.

"ఓ!" తల ఎగరేశాడు వాడు.

"మరయితే,మీ ప్రేయర్‌లో ప్రతిజ్ఞ చేస్తారు కదా, అది చెప్పు, చూద్దాం!" అన్నాను నేను, 'వచ్చో, రాదో' అని కొంచెం అనుమానపడుతూనే.

"మా పేయర్లో పతిగ్న ఉండదు!" అన్నాడు వాడు.

"అదేరా, ప్లెజ్- ప్లెజ్ ఉంటుంది కదా, ఇండియా ఈజ్ మై కంట్రీ..." అందించా.

"పెజ్ అంటే...అదుండదు మాకు. వేరేది ఉంటుంది" అన్నాడు వాడు.

"చెప్పుచెప్పు- నేనూ నేర్చుకుంటాను" ఉత్సాహపరచాను.

చెయ్యి ముందుకి చాపి, మళ్ళీ ఓసారి గడగడా చెప్పాడు- ఐ, ద స్టూడెంట్ ఆఫ్ ***, ఐ ప్రామిస్ దట్ ఐ‌ల్ లీడ్ మై లైఫ్ ఇన్ ఎ ట్రూత్ఫుల్ వే. ఐల్ ఆల్వేస్ స్పీక్ ఇన్ ఇంగ్లీష్ ఇన్ ద స్కూల్ క్యాంపస్ అండ్ ఔట్సైడ్ అల్సో..." అని.

"వావ్!" మెచ్చుకున్నాను. "భలే చెప్పావురా! దీని అర్థంఏంటో తెలుసా, నీకు?" అడిగాను మణిమాలమ్మని.

"అర్తం తెలీదు" అన్నాడు నాని.

"ఇంట్లోనూ, బయటా, ఇంకా స్కూల్లోనూ అంతటా నువ్వు ఇంగ్లీషులోనే మాట్లాడతావట!" నవ్వాను.

వాడూ నవ్వాడు. మణిమాలమ్మ కూడా నవ్వి- "ఇంగ్లీష్ మీడియం కదా, అందుకని" అంది.

"ఇంక నువ్వూ వాడూ మాట్లాడుకునేందుకు వీల్లేదన్న మాట!- నీకేమో ఇంగ్లీషు రాదు; వాడేమో తెలుగులో మాట్లాడకూడదు. బానే ఉంటుందిక, మీ జీవితం!" అన్నాను నేను, నవ్వుతూ.

మణిమాలమ్మ కూడా నవ్వింది. అయితే ఈసారి ఆ నవ్వులో కాస్తంత బెరుకు ఉందేమో అనిపించింది నాకు.

Published by NarayanaSarma for Kottapalli Prachuranalu,1-127/A, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph: 7702877670 mail: team@kottapalli.in and printed at Mudrica Offcet Printers, Vijayawada,Phone:08662579129